నాడు వైసీపీ ప్రభుత్వం గుండ్లకమ్మ ప్రాజెక్టును గాలికొది లేసింది. నిర్వహణ నిధులు సైతం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసింది. దీంతో ప్రాజెక్టుకు సంబంధించిన రెండు గేట్లు వరుసగా రెండేళ్లు కొట్టుకుపోయాయి. రిజర్వాయర్ ఖాళీ అయ్యింది. నీరంతా సముద్రం పాలైంది. ఫలితంగా రెండేళ్లు ఆయకట్టుకు నీరందక రైతులు నష్టపోయారు. రిజర్వాయర్‌లో చేపల వేట నమ్ముకొని ఉన్న కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి. విరిగి కొట్టుకుపోయిన రెండింటితోపాటు మిగిలిన గేట్లకు మరమ్మతులు చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ప్రాజెక్టులో ఒక టీఎంసీ లోపు కూడా నీటిని నిల్వ చేయలేని దుస్థితి నెలకొంది. ఆయకట్టుకు నీరిచ్చే అవకాశం లేకుండా పోయింది.

నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. గేట్ల మరమ్మతులకు సంబంధించిన అవరోధాలను తొలగించింది. అవసరమైన నిధులను కూడా కేటాయించింది. పనులు చకచకా జరిగాయి. 12గేట్ల పనులు పూర్తయ్యాయి. దీంతో నీటి నిల్వ పెరిగింది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో రెండు టీఎంసీల నీరు ఉంది. మిగిలిన మూడు గేట్లను కూడా అమర్చి ఈ నెలాఖరుకు పూర్తిస్థాయి నీరు 3.859 టీఎంసీలు నింపేలా అధికారులు చర్యలు చేపట్టారు. రైతులకు ఎప్పుడు అవసరమైతే అప్పుడు సాగు నీరు విడుదల చేస్తామని అధికారులు చెప్తున్నారు. ఫలితంగా ఆయకట్టు రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఆశాజలకం

కొలిక్కి వచ్చిన గుండ్లకమ్మ గేట్ల మరమ్మతులు

- ఇప్పటికే 12 పూర్తి, మరో రెండు సిద్ధం
- అందుబాటులో స్టాప్‌లాక్ గేట్లు
- ప్రస్తుతం రెండు టీఎంసీల నిల్వ
- నెలాఖరుకు పూర్తిస్థాయిలో నింపేలా చర్యలు
- రైతులు కోరితే ఇప్పుడైనా నీరు ఇచ్చే అవకాశం
- వైసీపీ పాలనలో పూర్తి నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వంలో శరవేగంగా పనులు

ఒంగోలు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ రిజర్వాయర్ పరిస్థితి ఆశాజకనంగా కనిపిస్తోంది. దాదాపు రెండున్నర సంవత్సరాల తర్వాత పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసే అవకాశం ఏర్పడింది. గత వైసీపీ పాలనలో ప్రాజెక్టును గాలికొదిలేశారు. నిర్వహణకు కూడా నిధులు ఇవ్వకపోవడంతో గేట్లకు గ్రీజు కూడా పెట్టే పరిస్థితి లేకపోయింది. దీంతో 2022 ఆగస్టు 31న మూడో నంబరు గేటు, 2023 డిసెంబరులో రెండో నంబరు గేటు కొట్టుకుపోయాయి. రెండు సార్లూ ప్రాజెక్టులోని నీరు సముద్రంపాలైంది. రిజర్వాయర్‌లో చేపలు పట్టుకొనే జాలర్ల పడవలు, వలలు, మొత్తం మత్స్య సంపద కొట్టుకుపోయింది. రెండేళ్ల ఆయకట్టుకు నీరందక రైతులు నష్టపోయారు. రిజర్వాయర్‌లో చేపల వేట నమ్ముకొని ఉన్న కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి. అప్పట్లో వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, వైఫల్యాన్ని ఎండగడుతూ ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ నేతలు ఆందోళనలు చేపట్టారు. వారి ఒత్తిడితో కొద్దిమేర గేట్ల మరమ్మతులపై వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించినా నిధులు ఇవ్వక కాంట్రాక్టర్ పనులు ఆపేశారు.

1,500 క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో

ప్రస్తుతం ప్రాజెక్టులో రెండు టీఎంసీల నీరు నిల్వ ఉంది. నిత్యం 1,500 క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో వస్తోంది. అది మరో వారం కొనసాగితే పూర్తి స్థాయిలో రిజర్వాయర్ నిండుతుంది. అప్పటికి 13 గేట్లు పూర్తయి, మిగిలిన రెండింటికీ స్టాప్‌లాక్ గేట్లు అమర్చితే పూర్తి స్థాయిలో నింపుకోవచ్చు. తద్వారా ఆయకట్టుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగు నీరు ఇవ్వవచ్చని ప్రాజెక్టు డీఈ శివనాగరాజు తెలిపారు.



గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీరు



రిజర్వాయర్‌కు ఏర్పాటు చేసిన కొత్త గేట్లు

కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కూటమి గుండ్లకమ్మపై ప్రత్యేక దృష్టి సారించింది. కొట్టుకుపోయిన రెండు గేట్లు, అప్పటికే మరమ్మతులు అవసరంగా భావించిన మరో రెండు గేట్లతోపాటు ప్రాజెక్టుకు ఉన్న 15 గేట్లకు మరమ్మతులు చేయాలని నిర్ణయించింది. వైసీపీ హయాంలో రెండు గేట్లకు టెండర్లు పిలవగా అందుకు అవసరమైన రూ.90లక్షలలో రూ.60 లక్షలు చెల్లించింది. మరో రూ.30లక్షలు పెండింగ్‌లో ఉంది. మిగిలిన 12 గేట్లు కొత్తవి ఏర్పాటుకు గుజరాత్ కంపెనీకి రూ.6.90 కోట్లతో టెండర్లు ఖరారయ్యాయి. ఈలోపు మరో గేటు కూడా దెబ్బతినగా ఆ పనిని కూడా గుజరాత్ కంపెనీకే ఇచ్చారు.

శరవేగంగా గేట్ల పనులు

మొత్తం రూ.7.50 కోట్లతో 13 గేట్ల పనులను చేపట్టిన గుజరాత్ కంపెనీ శరవేగంగా చేసింది. వాటికి సంబంధించి రూ.2.50కోట్లను కాంట్రాక్టర్‌కు ఆగస్టులోనే ప్రభుత్వం ఇచ్చింది. మరో రూ.4 కోట్ల పనులకు బిల్లులను అధికారులకు సమర్పించారు.

నెలాఖరుకు అన్ని గేట్లూ పూర్తి

ప్రాజెక్టుకు సంబంధించిన మొత్తం 15లో 12 గేట్ల పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మరో మూడు అమార్చాల్సి ఉండగా వాటికి ఒక్కో దానికి నాలుగేసి సెగ్మెంట్లు స్టాప్‌లాక్ గేట్లను ఏర్పాటు చేసి ప్రస్తుతం రిజర్వాయర్‌లో 2 టీఎంసీల (22అడుగులపైన) మేర నీటిని నిల్వ చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 3.859 టీఎంసీలు (24 అడుగులు) కాగా ఆస్థాయిలో నెలాఖరుకు నీటిని నింపేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు గేట్లలో రెండు తయారై గుజరాత్ నుంచి ప్రాజెక్టు వద్దకు చేర్చారు. అందులో ఒకదానిని రెండు, మూడు రోజుల్లోనే బిగించనున్నారు. అప్పటికి 13 గేట్లు పూర్తవుతాయి. మిగిలిన రెండింటి వద్ద ప్రస్తుతం ఉన్న స్టాప్‌లాక్ గేట్లలోని 12 సెగ్మెంట్లలో ఒక్కో దానికి ఆరేసి సెగ్మెంట్లు అమర్చవచ్చు. అలాచేస్తే మొత్తం రిజర్వాయర్ సామర్థ్యం 3.859 టీఎంసీల మేర నీటిని నిల్వ చేయవచ్చు.

మళ్లీ భూప్రకంపనలు

- ముండ్లమూరులో ఒకేరోజు రెండు సార్లు
- కలెక్టర్‌ను నివేదిక కోరిన మంత్రులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరు మండలంలో రెండోరోజైన ఆదివారం కూడా రెండు సార్లు స్వల్ప భూప్రకంపనలు సంభవించాయి. ఉదయం 10.36, సాయంత్రం 6.09 గంటలకు రెండు సెకన్లపాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దర్శి నియోజకవర్గంలోని కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్లో శనివారం భూప్రకంపనలు వచ్చాయి. మళ్లీ ఆదివారం ముండ్లమూరు, పసుపుగల్లు, శింగనపాలెం, ఉల్లగల్లు, మారెళ్లలో కంపించింది.

వరుస భూప్రకంపనలపై విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ఆరా తీశారు. కలెక్టర్ తమీమ్ అన్సారియాతో వారిద్దరూ ఆదివారం ఫోన్‌లో మాట్లాడారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వారిని సంప్రదించి తరుచూ ఆ ప్రాంతంలో భూ ప్రకంపనలు ఎందుకు వస్తున్నాయో తెలుసుకోవాలని సూచించారు. ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తలతో కూడా చర్చించి నివేదిక ఇవ్వాలని కోరారు. ప్రజలు భయాందోళనలు చెందకుండా ధైర్యంగా ఉండాలని మంత్రులు సూచించారు.

ఆట మొదలైంది!





సింగరాయకొండ మండలంలోని పాకల జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలు అట్టహాసంగా మొదలయ్యాయి. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి క్యారమ్స్ ఆడి ప్రారంభించారు. పోటీల్లో పాల్గొనేందుకు 13 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు వచ్చారు. తొలిరోజు హోరాహోరీగా జరిగాయి. - సింగరాయకొండ

7

నిధులు 'రాళ్ల'పాలు

- గత ప్రభుత్వంలో తాళ్లూరు మండలానికి 9వేల రీసర్వే రాళ్లు కేటాయింపు
- రూ.40.50 లక్షలు సర్వేయర్ల ఖాతాలకు జమ
- పొలాల వద్ద పాతింది వెయ్యి మాత్రమే
- అన్నీ వాడినట్టు పై అధికారులకు నివేదికలు

7



డ్వామా కార్యాలయంలో విచారణ చేస్తున్న అధికారులు

డ్వామా ఉద్యోగుల్లో అలజడి

- శీనారెడ్డి అక్రమాల్లో పలువురు సిబ్బంది భాగస్వామ్యం
- ప్రాథమికంగా కొన్ని అంశాలు గుర్తింపు
- కొనసాగుతున్న లోకేశ్వరరావు కమిటీ విచారణ
- విభాగాల వారీ ఫైళ్ల పరిశీలనకు నిర్ణయం
- తాజాగా అందిన ఫిర్యాదులపైనా దృష్టి

ఒంగోలు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పూర్వ పీడీ అవినీతిపై విచారణ నేపథ్యంలో ఆయనకు సహకరించిన ఉద్యోగుల్లో అలజడి మొదలైంది. పీడీగా శీనారెడ్డి పనిచేసిన కాలంలో జరిగిన అవినీతి, అక్రమాలపై కలెక్టర్ ఆదేశాలతో అధికారుల కమిటీ చేపట్టిన విచారణ కొనసాగుతోంది. శీనారెడ్డి పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని, తద్వారా భారీగా అవినీతి జరిగిందన్న ఫిర్యాదుల్లో పలు అంశాలు వాస్తవమేనని విచారణ కమిటీ గుర్తించింది. ఆ సమయంలో కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేసిన ఉద్యోగులు, సిబ్బంది పాత్ర కూడా ఉన్నట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చింది. తదుపరి విచారణపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఐదు రోజుల క్రితం ప్రస్తుత పీడీ అనుమతి లేకుండా శీనారెడ్డి డ్వామా కార్యాలయానికి వెళ్లి పలు ఫైళ్లకు సంబంధించిన నకళ్లను తనకు తెలిసిన సిబ్బంది నుంచి తీసుకెళ్లిన విషయం విదితమే. ఆ వ్యవహారాన్ని పీడీ జోసఫ్‌కుమార్‌తోపాటు విచారణ కమిటీ సభ్యులు కూడా సీరియస్‌గా తీసుకోవడంతో డ్వామా ఉద్యోగులు మరింత ఆందోళన చెందుతున్నారు.

అన్ని ఆరోపణలు వాస్తవమే..

వైసీపీ ప్రభుత్వ కాలంలో నాలుగున్నరేళ్లు పీడీగా శీనారెడ్డి పనిచేసిన సమయంలో భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయి. నిధుల విషయంలో ఇష్టారీతిన వ్యవహరించారన్న ఫిర్యాదులపై ప్రభుత్వ ఆదేశాలతో డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీని విచారణకు కలెక్టర్ నియమించిన విషయం విదితమే. పది రోజుల క్రితం విచారణ ప్రారంభించిన ఆ కమిటీ సభ్యులు మూడు నాలుగు రోజులు పలు అంశాలపై కార్యాలయ అధికారులు, సిబ్బందిని విచారించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు సంబంధించిన ఫైళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. మధ్యలో నాలుగైదు రోజులు విచారణ కమిటీ అధికారులు ఇతర పనులపై బిజీగా ఉన్నారు. తిరిగి శనివారం డ్వామా కార్యాలయానికి వచ్చి విచారణ ప్రారంభించారు.

ప్రాథమికంగా ఇప్పటివరకూ నిర్వహించిన విచారణలో తమకు అందిన ఫిర్యాదులలో పలు అంశాలు వాస్తవమేనన్న అభిప్రాయానికి వారు వచ్చినట్లు సమాచారం. కొందరు ఉద్యోగుల పాత్ర కూడా ఆయా అంశాలలో ఉన్నట్లు గుర్తించి ఆ వైపు దృష్టిసారించారు. ఇప్పటికే ఒంగోలు సీఎల్ఆర్‌సీ విభాగంలో చిరుద్యోగి రూ.10 లక్షలు అక్రమంగా డ్రా చేసిన విషయంలో నాటి పీడీ శీనారెడ్డి వ్యవహరించిన తీరు, అలాగే అంతకు ముందు ప్రభుత్వ ఉద్యోగి అయిన తన భార్య పేరుతో ఉన్న వాహనాన్ని అద్దెకు చూపి బిల్లులు డ్రా చేయడం వంటి అంశాలను గుర్తించి సంబంధింత విభాగాల సిబ్బంది నుంచి వివరణ తీసుకున్నారు.

శీనారెడ్డికి నోటీసులు

డ్వామాలోని విజిలెన్స్ విచారణ విభాగం, హెచ్‌ఆర్ విభాగంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు శీనారెడ్డితో అంటకాగినట్లు విచారణ కమిటీకి తాజాగా ఫిర్యాదులు అందాయి. కార్యాలయానికి అవసరమైన సామగ్రి, ఇతరత్రా సరఫరా చేసే కాంట్రాక్టు ఏజెన్సీ కార్యాలయానికి చెందిన ఉద్యోగిది కావడం వంటి అంశం కూడా వెలుగులోకి వచ్చింది. వీటన్నింటిపై ప్రాథమిక పరిశీలన చేసి వాటిలో వాస్తవాలు ఉన్నాయన్న నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. దీంతో తమకు అందిన ఫిర్యాదులను విభాగాల వారీగా క్రోడీకరించి తదుపరి విచారణకు కమిటీ సభ్యులైన డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ సిద్ధమయ్యారు. అందుకు వీలుగా ఆయా విభాగాల సిబ్బంది, సంబంధిత ఫైళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. మరోవైపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వపు పీడీ శీనారెడ్డికి కూడా వచ్చేనెల 2న వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇచ్చారు. ఆలోపు కార్యాలయంలో విచారణను ఒక కొలిక్కి తెచ్చే యోచనలో వారు ఉండగా మొత్తం వ్యవహారం డ్వామా సిబ్బందిలో అలజడి కలిగిస్తోంది.



సెమీ క్రిస్మస్ సందడి

ఒంగోలు పోలీసు క్వార్టర్స్‌లోని చర్చిలో సెమీక్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఎస్పీ దామోదర్ పాల్గొని కేక్ కట్ చేశారు. అక్కడికి వచ్చిన వారందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఏఆర్) అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, తాలుకా సీఐ అజయ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. - ఒంగోలు క్రైం

ముంచిన వాన

- కురిచేడు మండలంలో నీటిలో వరి ఓదెలు
- తడిసిన మిర్చి



ఆవులమందలో తడిసిపోయిన వరి ఓదెలు

కురిచేడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలంలో శనివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం రైతుల వెన్నువిరిచింది. వారిని కోలుకోలేని దెబ్బతీసింది. వరి ఓదెలు నీట మునిగాయి. కల్లాల్లో ఉంచిన మిర్చి తడిసిపోయింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. సాగర్ ఆయకట్టు కింద వరినాట్లు వేసిన భూముల్లో వారం నుంచి వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మిర్చి కోసి కల్లాల్లో ఉంచారు. ఈ తరుణంలో శనివారం అర్ధరాత్రి 12.30 గంటలకు వరుణుడు విరుచుకుపడ్డాడు. రైతుల ఆరుగాలం కష్టాన్ని నీటిపాల్జేశాడు. కోసి పొలాల్లో ఉన్న వరి ఓదెలు మునిగిపోయాయి. అర్ధరాత్రి వర్షం కురవడంతో పట్టలు కప్పే వ్యవధి కూడా లేక మిర్చి తడిసి ముద్దయ్యింది. నీళ్లలో ఉన్న మిర్చిని ఆదివారం రైతులు బయటకు తీసి ఆరబెడుతున్నారు. కోతకు వచ్చిన వరి పైరు అధిక వర్షానికి నేలవాలింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.



అధిక వర్షానికి నేలకొరిగిన వరి పైరు



ఆవులమందలో తడిసిన మిర్చిని ఆరబెడుతున్న రైతులు

ఘనంగా రామచంద్ర బ్రదర్స్ ఫర్నిచర్ షోరూం ప్రారంభోత్సవం



షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, నిర్వాహకులు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన రామచంద్ర బ్రదర్స్ మెగా ఫర్నిచర్ మాల్‌ను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ఫర్నిచర్ రంగంలో అనేక సంవత్సరాలుగా అనుభవం కలిగిన సుబ్బారావు ఒంగోలులో నాలుగు ఫ్లోర్‌లతో రామచంద్ర బ్రదర్స్ మెగా షోరూం ప్రారంభించడం సంతోషంగా ఉందని చెప్పారు. భవిష్యత్‌లో ఫర్నిచర్ రంగంలో మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. షోరూం అధినేత సుబ్బారావు మాట్లాడుతూ ఫర్నిచర్ రంగంలోనే అగ్రగామిగా ఉన్న రామచంద్ర బ్రదర్స్ ఫర్నిచర్, ఆరు నగరాల్లో ఇప్పటికే పది షోరూమ్‌లు ఉన్నాయని చెప్పారు. ఒంగోలులో కొత్తగా 11వ షోరూమ్‌ను ప్రారంభించామని, ఈ సందర్భంగా ప్రతి కొనుగోలుపై 25శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరలో అవసరమైన ఫర్నిచర్ అందుబాటులో ఉందని చెప్పారు. ప్రజలు తమను ఆదరించి వ్యాపారాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రామచంద్ర బ్రదర్స్ పాల్గొన్నారు.

పొగాకు బోర్డు స్టాఫ్ యూనియన్ కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డు స్టాఫ్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఒంగోలులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో జరిగిన యూనియన్ సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షుడె ఆర్. శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.రాజా శ్రీహర్ష(వెల్లంపల్లి), ఉపాధ్యక్షులుగా ఎం.మాల్యాద్రినాయుడు(కలిగిరి), ప్రధానకార్యదర్శిగా పి.రవిశంకర్(గుంటూరు), కోశాధికారిగా ఆర్.లక్ష్మణ(గుంటూరు), జాయింట్ సెక్రటరీగా జి.రామకృష్ణ, రీజనల్ సెక్రటరీగా ఎండీ.సబీనా(గుంటూరు), ఎస్‌బీఎస్ రీజనల్ సెక్రటరీగా సి.సందీప్‌భార్గవ(ఒంగోలు), ఎస్ఎల్ఎస్ రీజనల్ సెక్రటరీగా ఎం.సంతోష్‌కుమార్(కందుకూరు), ఎన్ఎల్ఎస్ రీజనల్ సెక్రటరీగా కె.రమేష్(కొయ్యలగూడెం), మైసూరు రీజనల్ సెక్రటరీగా ఎం.సందీప్ (చిలకుంద), మహిళా ప్రతినిధిగా వి.హిమశైలజ(గుంటూరు)లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

- ముందు వెళుతున్న మోటార్‌సైక్లిస్టు బ్రేక్ వేయడంతో ఘటన



ప్రమాద స్థలంలో ఉన్న వాహనాలు

ఒంగోలు(క్రైం), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసులను చూసి సడన్ బ్రేక్ వేసిన మోటార్‌సైక్లిస్టు కింద పడగా, అతడిని తప్పించే ప్రయత్నంలో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న నలుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ సంఘటన ఒంగోలులోని పాత జాతీయ రహదారిపై గల బులెట్ షోరూం సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాలలోకి వెళితే.. మోటార్‌సైకిల్‌పై ఓ యువకుడు మంగమూరు రోడ్డు జంక్షన్ నుంచి దక్షిణం వైపు వేగంగా వెళుతున్నాడు. అయితే బుల్లెట్ షోరూం సమీపంలో అధిక సంఖ్యలో ఉన్న ట్రాఫిక్ పోలీసులను చూసి ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో అదుపు తప్పి కింద పడ్డాడు. ఈక్రమంలో మోటార్‌సైకిల్ వెనుక వస్తున్న ఆటో డ్రైవర్ కింద పడిన యువకుడిని తప్పించేందుకు సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆటో అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఆ సమయంలో ఆటోలో ఏడుగురు ప్రయాణికులు ఉండగా నలుగురుకి గాయాలు అయ్యాయి. క్షతగాత్రుల్లో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న పెరిది సురేష్, యరజర్లకు చెందిన షేక్ మస్తాన్, వెంగముక్కపాలెంనకు చెందిన దాసరి ఆదిలక్ష్మి, ఒడిశాకు చెందిన మదన్ ఉన్నారు. వెంటనే అక్కడ ఉన్న ట్రాఫిక్ పోలీసులు ఓ వాహనంలో రిమ్స్‌కు తరలించారు.

హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఒంగోలు విద్య, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో వస్తువుల కొనుగోలు విషయంలో వినియోగదారులు తమకు ఉన్న హక్కులను తెలుసుకోని మోసపోకుండా ఉండాలని ప్రధానోపాధ్యాయురాలు జి.కృష్ణకుమారి సూచించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఒంగోలు నగరం బండ్లమిట్ట పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు వక్తృత్వ పోటీలో ఇంగ్లీషు మీడియంలో టి.నిషి, తెలుగు మీడియంలో ఇ.కోమాలిక, వ్యాసరచన పోటీల్లో ఇంగ్లీషు మీడియంలో ఎస్.దీక్షిత, తెలుగు మీడియంలో ఐ.చంద్రశేఖర్‌లు జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలు సోమవారం విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘం అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి డి.చంద్రశేఖర్, నాయకులు ఏనుగుల సురేష్‌బాబు, యర్రం అంజిరెడ్డి, ఎస్‌కే.అంజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలను డీఎస్‌వో పద్మశ్రీ పరిశీలించి పలు సూచనలు చేశారు.

టెన్త్ విద్యార్థులకు మోడల్ పరీక్ష

చీమకుర్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : పదోతరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ సహకారంతో ఆదివారం దేవరపాలెం, చీమకుర్తిలలో మోడల్ పరీక్ష నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు దేవరాజు, యూటీఎఫ్ అధ్యక్షుడు అక్బర్, చలువాది శ్రీను, అమరా మురళి, ప్రవీణ్, శ్రీకాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.

చీరల పంపిణీలో వైసీపీ నేతల చేతివాటం

- విస్తుపోయిన మహిళలు



చీరల కట్టను బయటకు తరలిస్తున్న నాయకులు (ఫైల్)

టంగుటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి జగన్ పుట్టిన రోజు సందర్భంగా శనివారం టంగుటూరులో వైసీపీ ఆధ్వర్యాన చీరల పంపిణీ జరిగింది. అయితే వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. జగన్ పుట్టిన రోజు సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో చీరల పంపిణీ జరిగింది. చీరలను పార్టీ అధిష్ఠానం మండల కేంద్రానికి చేర్చింది. టంగుటూరు మండలానికి 535 చీరలను కేటాయించింది. పార్టీ కార్యాలయంలో కేక్‌లు కటింగు చేసిన కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్‌బాబు, ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోతూ చీరలు పంపిణీ చేయాలని మండల వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులను ఆదేశించారు. వెంటనే రంగంలోకి దిగిన టంగుటూరు మాజీ సర్పంచ్ పుట్టా వెంకట్రావు, ఎంపీటీసీ ప్రభుదాస్ ఇతర పార్టీ క్యాడర్‌ను దగ్గర పెట్టుకొని చీరల పంపిణీ ప్రారంభించారు. ఒక వైపు చీరల పంపిణీ జరుగుతుండగా మరొక వైపు కట్టలు కట్టలు చీరలు బయటకు తరలించడం కనిపించింది. బయటకు తరలిస్తున్న చీరలను గేటు వద్ద మహిళలు అడ్డుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. కేవలం 300 చీరలు పంపిణీ మాత్రమే జరిగిందని, మిగిలిన చీరలన్నీ నాయకులు బయటకు పంపించారని అక్కడివారు విమర్శిస్తున్నారు. పార్టీ కార్యాలయం వద్ద గంటల తరబడి పడిగాపులు కాసినా ప్రయోజనం లేనేలేదని చీరల కోసం వెళ్లి ఉసూరుమంటూ వెనుతిరిగిన మహిళలు విమర్శిస్తున్నారు. అయితే పార్టీ గ్రామీణ నాయకులు కొందరు వారి భార్యల పేరుచెప్పి రెండేసి చీరలు తీసుకపోయిన్నట్లు చెబుతున్నారు.

పాకల తీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

- మంత్రి డాక్టర్ స్వామి

సింగరాయకొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పాకల తీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. ఆదివారం రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన పాకల తీరంలో పర్యటించారు. గత టీడీపీ ప్రభుత్వంలో పర్యాటకుల కోసం రూ.4 కోట్ల టూరిజం రెస్టారెంట్ పనులను ప్రారంభించి సగభాగం పూర్తి చేస్తే వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా ఆ పనులను నిలిపివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిలిచిపోయిన టూరిజం రెస్టారెంట్ పనులను ఏడాదిలోపు ప్రారంభించి పూర్తిచేస్తామని తెలిపారు. తీరంలో విధులు నిర్వహించే మెరైన్ పోలీసులకు ప్రత్యేకంగా ఒక గదిని నిర్మించాలని, దానిపై అద్దాలతో మరొక రూమ్‌ను ఏర్పాటు చేయాలని అందులో 360 యాంగిల్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి బీచ్ పరిసరాలపై నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. అందుకోసం పంచాయతీ నుంచి రూ.5 లక్షల నిధులు ఇవ్వాలని సర్పంచ్ సైకం చంద్రశేఖర్‌కు సూచించారు. పాకల బీచ్ నుంచి చెల్లమ్మపాలెం వరకూ, బీచ్‌కు ఉత్తరం 300 మీ తీరంలో ఉన్న సీసీ రోడ్డును కలుపుతూ మెటల్ రోడ్డు వెయ్యాలని సర్పంచ్‌ను ఆదేశించారు. తీరంలో పార్క్ నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తాయని తెలిపారు.

కళాకారులు ఐకమత్యంగా ఉంటేనే అభివృద్ధి

- మా అసోసియేషన్ అధ్యక్షుడు గౌతంరాజు



మాట్లాడుతున్న గౌతంరాజు

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కళాకారులు ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకుంటూ ఐకమత్యంగా ఉంటే అభివృద్ధి సాధించగలుగుతారని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్(మా) ఏపీ అధ్యక్షుడు, సినీ నటుడు గౌతంరాజు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఒంగోలులోని వీవీఎం డిగ్రీ కళాశాలలో మా ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌతంరాజు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత 2021లో మా ఆంధ్రప్రదేశ్ శాఖను ఏర్పాటు చేశారని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నటీనటులు, రచయితలు, దర్శకులు మొదలైన వారిని గుర్తించి వారికి సరైన అవకాశాలు లభించేవిధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం జిల్లాల వారీగా శాఖలను ఏర్పాటు చేసి, వాటి ఆధ్వర్యంలో ఆడిషన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద కళాకారులకు ప్రభుత్వం నుంచి ఇళ్లస్థలాలు సాధించటం, అవసరమైన వైద్య సదుపాయాలు కోసం ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం భవిష్యత్తులో ప్రతి జిల్లాలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి కళాకారులను ప్రోత్సహిస్తామన్నారు. జిల్లా అధ్యక్షులు సతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హాస్యనటుడు, రచయిత హరిబాబు, ప్రముఖ గాయకుడు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. తర్వాత నిర్వహించిన నటన ఆడిషన్స్‌లో దాదాపు 30 మంది కళాకారులు పాల్గొని తమ నటనను ప్రదర్శించారు.

భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు

నాగులుప్పలపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆదివారం ఉప్పుగుండూరులో సీఐటీయూ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996లో కేంద్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసిందని, రాష్ట్రంలో గత పాలకులైన టీడీపీ, వైసీపీలు బోర్డు నిధులు రూ.1600 కోట్లు పక్కదారి పట్టించారని ఆరోపించారు. చివరకు బోర్డును నిర్వీర్యం చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణాల మీద వసూలు చేస్తున్న సెస్‌లను కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే వినియోగించాలన్నారు. కానీ గత ఐదు సంవత్సరాల కాలంలో డెత్‌క్లయిమ్‌లు, కాన్పులు తదితర సంక్షేమ పథకాలు నిలుపుదల చేశారని, వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. స్కీం కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని చెప్పారు. అన్ని రంగాల కార్మికులు సంఘాన్ని బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రామారావు, జి.బసవపున్నయ్య, నాయకులు చిరంజీవి, బాలకృష్ణ, ఎలీషా, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంతో సురక్షిత ప్రయాణం : సీఐ



ఒంగోలులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్

ఒంగోలు(క్రైం), డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ మంది హెల్మెట్ లేకుండా వాహన చోదన చేసి తలకు గాయాలై మృత్యువాత పడుతున్నారని, అందువల్ల ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ వాడలని ట్రాఫిక్ సీఐ వై.పాండురంగారావు పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి బులెట్ షో రూం వరకు పోలీసు సిబ్బంది, వాహనదారులతో హెల్మెట్‌లు ధరించి అవగాహన ర్యాలీ నిర్వహిచారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. రహదారులపై డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహన చోదన చేయకూడదని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: ఎస్పీ ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతపై నాగులుప్పలపాడులో పోలీసులు ఆదివారం అవగాహన కల్పించారు. ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో హెల్మెట్ లేకుండా జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఉపయోగాలను వివరించారు.

పురందేశ్వరికి సత్కారం



పురందేశ్వరిని సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని ఆ పార్టీ నాయకులు సత్కరించారు. ఆదివారం ఒంగోలుకు వచ్చిన ఆమెను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి ఆధ్వర్యంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి బొకే అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు అంశాలను పురందేశ్వరి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్యయాదవ్, బొద్దులూరి ఆంజనేయులు, డాక్టర్ నర్సింగరావు, రమాదేవి పాల్గొన్నారు.

పురందేశ్వరిని కలిసిన సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు

మద్దిపాడు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు, దొడ్డవరప్పాడు సర్పంచ్ బెజవాడ శ్రీరామమూర్తి ఒంగోలులో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె పంచాయతీరాజ్ శాఖ గురించి అడుగగా, నిధులు సకాలంలో అందుతున్నాయని, అయితే గ్రామ పంచాయతీలు ఎటువంటి తీర్మానాలు లేకుండా పనులు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆదివారం రాత్రి ఒంగోలులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట మాల ఉద్యోగుల సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ముందుగా మల్లయ్యలింగం భవన్‌లో మాలమహానాడు రాష్ట్ర వ్యవస్థాపకుడు పీవీరావు వర్ధంతి సభ నిర్వహించి అక్కడి నుంచి ర్యాలీగా బయలు దేరి అంబేడ్కర్ విగ్రహం మోకాళ్ళపై కూర్చోని నిరసన వ్యక్తం చేశారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి జనార్దన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు హనుమంతరావు, గోపీనాథ్, యరమాల మల్లికార్జునరావు, పిల్లి మాల్యాద్రి, నాగేంద్రవదన్, కొండయ్య, పర్రె వెంకట్రావు, మధుసూదనరావు, వెంకట్, తిరుపతిస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలి



ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు బాగా చదివి పరీక్షలకు సిద్ధం కావాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు ఉమామహేశ్వరి సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పీవీఆర్ బాలుర పాఠశాల పరీక్షా కేంద్రంలో ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ విద్యారంగ సమస్యలపై పోరాటం చేయడం మాత్రమే కాకుండా విద్యార్థులు అభివృద్ధి కోసం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పది కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, జయప్రకాష్, బండి వీరస్వామి, దేవ, రాజశేఖర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి

సంతనూతలపాడు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బిగించిన స్మార్ట్ విద్యుత్ మీటర్లను తొలగించి, పెంచిన విద్యుత్ చార్జీలను తొలగించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పేర్నమిట్టలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలనే, కూటమి ప్రభుత్వం చేస్తూ ప్రజలను ఇబ్బందులు పాలు చేస్తోందని జిల్లా కమిటీ సభ్యులు బంకాసుబ్బారావు ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఏవీ.సుబ్బారావు, రామక్రిష్ణ, చినబాబు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన యువకులతో రియాజ్, కంది రవిశంకర్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని పలు కాలనీలకు చెందిన యువకులు జనసేన పార్టీలో చేరారు. స్థానిక జనసేన కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, నాయకుడు కంది రవిశంకర్‌ల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన యువకులకు కండువాలు వేసి ఆహ్వానించారు. త్రోవగుంట, కేశవరాజుకుంట, మామిడిపాలెం, భాగ్యనగర్, వడ్డెపాలెంకు చెందిన గౌరీశంకర్, కన్న, మణికంఠ, దుర్గా, రాజేష్, సాయిబాల, చందు, సూర్య, ఆసీఫ్ తదితరులు చేరారు.

దామచర్లను కలిసిన డీఎంహెచ్‌వో



ఎమ్మెల్యే దామచర్లకు బొకే ఇస్తున్న వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా నియమితులైన డాక్టర్ వెంకటేశ్వర్లు ఆదివారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనార్దన్‌కు బొకే అందజేశారు. ఈ సందర్భంగా వైద్యఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చూడాలని దామచర్ల సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎన్

సంతనూతలపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ నివాసంలో ఆదివారం స్థానిక 39వ డివిజన్‌కు చెందిన గుండవరపు ఆంజనేయులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.81వేల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా వేణు



నియామకపత్రం అందుకుంటున్న వేణు

నాగులుప్పలపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడిగా ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన అమరా వేణు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఉప్పుగుండూరులోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఆ సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొంజేటి వెంకటసురేష్‌బాబు, కార్యదర్శి చెక్కా సుబ్బారాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ముప్పల శ్రీనివాసులు సమక్షంలో మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా అమరా వేణు, కార్యదర్శిగా కోట వెంకటేశ్వర్లులను ఎన్నుకొన్నారు. వారికి నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళ, బుధవారాల్లో ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. మంగళవారం ఉదయం పదిన్నర గంటలకు కలెక్టరేట్‌లో జరిగే నేషనల్‌బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ అధికారులతో జరిగే సమావేశంలో పాల్గొంటారు అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు, రాత్రి 8.30 గంటలకు జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్‌చర్చిలో జరిగే క్రిస్మస్ సందర్భంగా నిర్వహించే వేడుకల్లో పాల్గొంటారు. బుధవారం ఉదయం 9గంటలకు టంగుటూరులో స్వర్గీయ పోతుల చెంచయ్య వర్ధంతి కార్యక్రమానికి మాగుంట హాజరవుతారు.

బస్సు ఢీకొని ఇరువురికి తీవ్రగాయాలు

ఒంగోలు(క్రైం), డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ప్రమాణిస్తున్న ఇరువురు యువకులకు గాయాలు అయ్యాయి. ఈ సంఘటన ఒంగోలులోని ఎంఎస్ ఫంక్షన్‌హల్ వద్ద శనివారం రాత్రి జరిగింది. వివరాలలోకి వెళితే.. స్థానిక బిలాల్ హోటల్‌లో పనిచేసే వంట మాస్టర్లు ఒడిశాకు చెందిన డి.రవిచంద్ర, ఎస్‌కే.లాలన్ ద్విచక్రవాహనంపై తాము నివాసం ఉండే భాగ్యనగర్‌కు వెళుతున్నారు. ఈక్రమంలో వెనుక నుంచి అత్యంత వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు మోటర్‌సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో దానిపై వెళుతున్న రవిచంద్ర, లాలన్‌కు త్రీవ గాయాలు కాగా వారిని వైద్యసేవలు నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని వన్‌టౌన్ ఎస్ఐ త్యాగరాజు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూల్ గేమ్స్‌కు ఆలకూరపాడు విద్యార్థి ఎంపిక



సింహాద్రిఅర్జున్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

టంగుటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ క్రికెట్ పోటీలకు ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సింహాద్రి అర్జున్ ఎంపికయ్యారు. సింహాద్రి అర్జున్ డిసెంబరు 22 నుంచి 24 వరకు మచిలీపట్నం ఆంధ్రజాతీయ కళాశాల మైదానంలో జరిగే ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 19 క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు తరుపున పాల్గొననున్నట్లు పాఠశాల హెచ్ఎం, పీడీ వాకా వెంకటేశ్వర్లు, పీడీ వెంకట్రావు తెలియజేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు క్రీడాకారుడిని అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమార్తెలకు గాయాలు



గాయపడిన తండ్రి, కుమార్తెలు

మద్దిపాడు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లిలోని మహి ఆగ్రో గోడౌన్స్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ తండ్రికి తీవ్ర గాయాలు కాగా ఇరువురు కుమార్తెలు గాయపడ్డారు. విజయవాడ నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న స్కూటీని అదేమార్గంలో ప్రయాణిస్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో స్కూటీపై వెళ్తున్న పామూరు మండలం బొట్లగూడూరుకు చెందిన పత్తిబోయిన మనోహర్ తలకు తీవ్ర గాయాలు కాగా స్కూటీపై ఉన్న చిన్నారులు ధాన్యశ్రీ, మేఘనశ్రీలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహనం ద్వారా చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోటరీ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్లను అందజేసిన రఘుకిరణ్, ప్రతినిధులు

చీమకుర్తి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెరుకూరి రఘుకిరణ్ చేతులమీదుగా 10మిషన్లను చీమకుర్తిలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభ్యున్నతికి రోటరీ క్లబ్ చేయుతనందిస్తుండటం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కడవా రామకృష్ణ, కార్యదర్శి కందుకూరి వెంకటసుధాకర్, పోకూరి తిరువెంగళం, పోకూరి రామకృష్ణారెడ్డి, అంబటి వీరారెడ్డి, నాగళ్ల సత్యం, దొంతు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో పంట దిగుబడుల్లో వృద్ధి

టంగుటూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విత్తనశుద్ధి చేయడం ద్వారా పంట దిగుబడుల్లో వృద్ధి సాధించవచ్చని సీఆర్‌పీ శ్రుతి అన్నారు. మండలంలోని ఎం.నిడమలూరులో ఆదివారం ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి ఆదేశాల మేరకు రైతు పొలంలో విత్తుకునే ముందుగా విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేశారు. శనగపంట సాగులో అంతరపంటలుగా ఆవాలు, ధనియాలు, పొద్దుతిరుగుడు పంటలు సాగు చేశారని చెప్పారు.

నిధులు రాళ్లపాలు

- గత ప్రభుత్వంలో తాళ్లూరు మండలానికి 9వేల రీసర్వే రాళ్లు కేటాయింపు
- రూ.40.50 లక్షలు సర్వేయర్ల ఖాతాలకు జమ
- పొలాల వద్ద పాతింది వెయ్యి మాత్రమే
- సచివాలయాల వద్ద నిరుపయోగంగా రాళ్లగుట్ట
- అన్నీ వేసినట్టు పై అధికారులకు నివేదికలు

రీ సర్వే పేరుతో గత ప్రభుత్వం పొలాలకు సరిహద్దులు చూపి, పాతడానికి తెచ్చిన రాళ్లు సచివాలయాల వద్ద నిరుపయోగంగా ఉన్నాయి. రీసర్వే జరిగిన గ్రామాల్లో కూడా హద్దు రాళ్లను ఏర్పాటు చేయలేదు. తాళ్లూరు మండలానికి 9 వేల రాళ్లు వస్తే కేవలం వెయ్యి రాళ్లు పాతి మిగిలినవి వదిలేశారు. వీటి కోసం వెచ్చించిన రూ.40.50 లక్షలు రాళ్లపాల్జేశారు.


మాధవరం సచివాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న రీసర్వేరాళ్లు

తాళ్లూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని 6 గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తి కావటంతో అన్ని గ్రామాలకు 9 వేల సర్వేరాళ్లు వచ్చాయి. వాటిని నాటేందుకు రైతులు వ్యతిరేకించారు. ఆ రాళ్లను మండలంలోని మల్కాపురం, శివరాపురం, దోసకాయలపాడు, మాధవరం, బేచరాకు గ్రామాలు సార్వమిట్ట, శంకరనారాణపురం గ్రామాలకు సంబంధించిన సర్వే రాళ్లను మల్కాపురం, మాధవరం, దోసకాయలపాడు, బొద్దికూరపాడు, శివరాంపురం, మన్నేపల్లి సచివాలయాల వద్ద గుట్టగా పోశారు. ఒక్కో రాయి విలువ రూ.450 పైమాటేనని రెవెన్యూ అధికారులు అంటున్నారు. రాయి మీద జగన్ బొమ్మతో కలిపి ఒక్కో రాయి రూ.300 టెండర్ అని, పొలం హద్దు వద్ద పూడ్చడానికి మరో రూ.150 కలిపి మొత్తం రూ.450 గత ప్రభుత్వం వెచ్చించింది. వాటిపై ఉన్న జగన్ బొమ్మను తుడిపించి సర్వే రాళ్లుగా ఇవ్వాలంటే ప్రభుత్వానికి తడిసి మోపెడవుతుంది.

జిల్లా అధికారులకు తప్పుడు నివేదికలు

గ్రామాల్లో రీ సర్వే రాళ్లు నాటేందుకు గత ప్రభుత్వం గ్రామ సర్వేయర్ల అకౌంట్లకు నగదు జమ చేసింది. మండలానికి సంబంధించి 9 వేల రాళ్లకు రూ.40.50 లక్షలు ఇచ్చింది. మండలంలోని మల్కాపురం, మాధవరం, సార్వమిట్ట, శంకరనారాయణపురం గ్రామాల్లో వెయ్యి రాళ్లు పాతారు. మిగిలిన ఏ గ్రామంలో కూడా హద్దు రాళ్లు పాతలేదు. వీలేజ్ సర్వేయర్లు మాత్రం హద్దురాళ్లు పాతినట్టు జిల్లా అధికారులకు తప్పుడు నివేదికలు పంపి ఆ నగదును స్వాహా చేశారన్న విమర్శలు వస్తున్నాయి.

జగన్ బొమ్మతో రాళ్లు వద్దన్నాం



మా ఊళ్లో జరిగిన రీ సర్వే అంతా తప్పులతడకగా ఉంది. విస్తీర్ణాలు హెచ్చు,తగ్గులున్నాయి. దీనికి తోడు మా పొలాలకు జగన్ బొమ్మతో రాళ్లు ఏమిటని పాతనీయలేదు.

- నుసుం ఆదినారాయణరెడ్డి, మాధవరం


రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో విజేతగా నిలిచిన ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర జట్టు

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ప్రకాశం ప్రథమం

పంగులూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో ఉమ్మడి ప్రకాశం బాలుర జట్టు విజేతగా నిలిచింది. ఈ నెల 20 నుంచి 22 వరకు అండర్-19 స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు చిత్తూరు జిల్లా పుత్తూరులో జరిగాయి. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీలో చిత్తూరు జట్టుపై తలపడిన ప్రకాశం బాలుర జట్టు 7 పాయింట్ల ఆధిక్యతతో విజయం సాధించినట్లు ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేతులమీదుగా బహుమతి అందుకున్నట్లు తెలిపారు.



వివిధ జిల్లాల నుంచి పోటీలకు హాజరైన విద్యార్థులు (ఇన్‌సెట్లో) క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి స్వామి

అట్టహాసంగా రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలు

- ప్రారంభించిన మంత్రి స్వామి

సింగరాయకొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాకల జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్యారమ్స్ పోటీలు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి.సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. అండర్ - 14, 17, 19 బాలబాలికల విభాగాల్లో పోటీల్లో పాల్గొనడానికి ఉమ్మడి 13 జిల్లాల నుంచి దాదాపు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్యారమ్స్ క్రీడాకారుల మధ్య పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. 75 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పోటీల నిర్వహణలో పాల్గొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన క్యారమ్స్ క్రీడాకారులతో పాకల హైస్కూల్ క్రీడా ప్రాంగణం సందడిగా మారింది. దీంతో విద్యార్థులతో పాటు గ్రామస్థులు కూడా పోటీలను ఆసక్తి తిలకిస్తున్నారు. క్రీడాకారులు నిర్వహించిన మార్చ్‌పాస్ట్ చూపరులను ఆకట్టుకుంది. ఈ పోటీలు రేపు కూడా కొనసాగనున్నాయి

నేడు వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ

- రూ. 2.40 కోట్లతో సర్వాంగసుందరంగా గుడి పునర్నిర్మాణం
- కొండమంజులూరులో ఆధ్యాత్మిక వాతావరణం
- తొలిరోజు కనులపండువగా గ్రామోత్సవం
- సుదూరప్రాంతాల నుంచి తరలివచ్చిన బంధువులు


కొండమంజులూరులో పునర్నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయం

పంగులూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమంజులూరు గ్రామంలో సోమవారం శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం జరగనుంది. గ్రామంలో రూ. 2.40 కోట్లతో సర్వాంగ సుందరంగా ఆలయాన్ని పునర్‌నిర్మించారు. నూతన ఆలయంలో దేవతామూర్తులు కొలువు దీరనున్నారు. సోమవారం తెల్లవారుజామున 4.50గంటల నుంచి 5.45 గంటల మధ్య శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారితో పాటు ద్వారపాలకులు, విమాన శిఖర కలశ జీవధ్వజాది పీఠారోహనం జరగనుందని వేద పండితులు రొంపిచర్ల వెంకట సత్యనారాయణాచార్యులు తెలిపారు.

కనుల పండువగా దేవతామూర్తుల ఊరేగింపు

ఈ సందర్భంగా ఆదివారం వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బింబశుద్ధర్థం పంచగవ్యాధివాసం, క్షీరాధివాసం, జలాధివాసం కార్యక్రమాలతో పాటు హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రతిష్ఠాపన చేయనున్న విగ్రహాలతో సంప్రదాయబద్ధంగా గ్రామోత్సవాన్ని పురవీధులలో కనులపండువగా నిర్వహించారు. సాయంసవనం కుంభాభిమర్శనం, హోంత్ర ప్రశంసం, సర్వదేవతా శయనాధివాసం, పుష్పాధివాసం, ధాన్యాధివాసం, మహాశాంతి హోమం, నివేదన, హారతి, తీర్థప్రసాద వినియోగ కార్యక్రమాలు జరిగాయి. పూజా కార్యక్రమాలలో వేద పండితులతో పాటు ఆలయ అర్చకులు ప్రసాదబాబు, శ్రీనివాస్, రాంబాబులు, పలువురు దంపతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గోవింద నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. సోమవారం ప్రతిష్ఠోత్సవం అనంతరం అన్నదానం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు ఆలయ కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే బంధువుల రాకతో కొండమంజులూరు గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.


పురవీధులలో దేవతామూర్తులకు నిర్వహిస్తున్న గ్రామోత్సవం

కుల సంఘాలు అభివృద్ధికి తోడ్పడాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

బాలికల వసతి గృహానికి భూమి పూజ



బాలికల వసతిగృహ భూమి పూజ, అనంతరం మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, వేదికపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తదితరులు

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి):సమాజంలో కుల సంఘాలు ఉండటం తప్పుకాదని, ఆ కులంలో అవకాశాలు వచ్చి అందిపుచ్చుకోలేని వారి అభివృద్ధికి తోడ్పడాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. ఆదివారం జిల్లా కాకతీయ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఒంగోలులో జరిగిన బాలికల వసతి గృహ భూమి పూజ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాలికల కోసం హాస్టల్ నిర్మించటం అభినందనీయమని అన్నారు. పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ పేద పిల్లల అభివృద్ధికి సమాఖ్య చేస్తున్న కృషిని కొనియాడారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన పిల్లలకు ఉపకార వేతనాలు అందించటం గొప్ప విషయమని అన్నారు. స్థలదాత, భగీరథ కెమికల్స్ తరపున మేనేజర్ వెంకట్రామయ్యను అతిథులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన వైష్ణవి ఆధ్వర్యంలో చిన్నారులు ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు ఆకట్టుకున్నా యి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఈదర హరి బాబు, దివి శివరాం, నాయకులు గో రంట్ల రవికుమార్, సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వెలగపూడి గోపాలకృష్ణ, మురకొండ బోసు బాబు, వెలగా కోటేశ్వర రావు, నల్లూరి వెంకటేశ్వర్లు, కామేపల్లి శ్రీనివాసరావు, నామినేని మోహన్‌రావు, కార్పొరేటర్ ఈదర చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

కాపు ఉపాధ్యాయులకు అండగా ఉంటా

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయం

జనసేన నాయకుడు కంది రవిశంకర్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కాపు ఉపాధ్యాయులకు అండగా ఉంటానని రవి శంకర్ గ్రూపు అధినేత, జనసేన పార్టీ నాయకుడు కంది రవిశంకర్ అన్నారు. స్థానిక మహాలక్ష్మి ఫంక్షన్‌హాలులో ఆదివారం ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాపు టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో కాపువిద్యార్థులను ప్రోత్సహించేందుకు పదేళ్ల నుంచి పారితోషికాలు ఇవ్వడం హర్షణీమన్నారు. అలాగే వారు నిర్వహించే కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులు బెల్లంకొండ వెంకట రంగయ్య, పి. శ్రీనివాసరావు, రామారావు, రాధాకృష్ణమూర్తి, భాస్కర్‌నాయుడు, రామిశెట్టి శేషుకుమారిలను సత్కరించారు. అదే విధంగా రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మంత్రి శ్రీనివారావు మాట్లాడుతూ కాపు టీచర్స్ అసోసియేషన్ నిర్వహించే కార్యక్రమాలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు బీసాబత్తిన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తూము శ్రీనివాసరావు, పోలిశెట్టి గంగాధర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కార్పొరేటర్ మలగా రమేష్, వివిధ సంఘాల నాయకులు కొల్లా నారాయణరావు, ఫణీంద్రకుమార్, మాధవ రావు, చోడిశెట్టి శ్రీనివాస్, ఆకుపాటి వెంకటేష్, కుప్పా రంగనాయకులు, యేలం వెంకటేశ్వరరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, వరికూటి నాగరాజు, బెల్లంకొండ విజయలక్ష్మి, కొంకాల రామ్మోహన్, ఆరిగ వీరప్రతాప్ తదితరులు ఉన్నారు.


కాపు విద్యార్థినులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న కంది రవిశంకర్

ముందు వెళ్తున్న బస్సును అధిగమించబోయి..


వేగం అదుపుగాక బస్సును ఢీకొని నుజ్జయిన కారు

- అదుపుతప్పి ఢీ కొట్టిన కారు
- భార్య మృతి, కుమార్తె, భర్తకు గాయాలు


మల్లిక (ఫైల్)

పెద్దదోర్నాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ముందు వెళ్తున్న టూరిస్టు బస్సును వెనుకగా వస్తున్న కారు వేగం అదుపు తప్పి ఢీ కొట్టిన ఘటన స్థానిక పెద్దవంతెన వద్ద ఆదివారం చోటుచేసుకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న మహిళ వంకే మల్లిక(28) ఘటనా స్థలంలోనే మృతి చెందగా కుమార్తె జోషిక, భర్త మురహరి బాబూరావుకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం. శ్రీశైలానికి చెందిన వంకే మల్లిక దేవస్థానానికి చెందిన వైద్యశాలలో నర్సుగా పనిచేస్తోంది. భర్త బాబూరావు ట్రాన్స్‌కోలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా మల్లిక కుటుంబం సొంత కారులో కర్నూలు వెళ్లి తిరిగి శ్రీశైలం వస్తుండగా దోర్నాల పెద్ద వంతెన వద్దకు రాగానే ముందుగా మధ్యప్రదేశ్‌కు చెందిన టూరిస్టు బస్సు శ్రీశైలం వెళుతోంది. ఆ బస్సును అధిగమించే క్రమంలో వేగం అదుపు తప్పి బస్సును ఢీ కొట్టింది. మల్లిక భర్త బాబూరావు కారును నడుపుతున్నాడు. అయితే ముందు సీట్లో కూర్చున్న తండ్రి కుమార్తెకు ఎయిర్ బ్యాగులు విప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. వెనుక సీట్లో కూర్చున్న మల్లిక తలకు తీవ్రగాయమై అక్కడిక్కడే మృతి చెందింది. స్వల్ప గాయాలయిన వారిని 108 అంబులెన్స్ వాహనంలో దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జ్ ఎస్సై అనిల్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

క్రైం సమాచారం

ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒకరికి తీవ్రగాయాలు


వైద్యశాలలో చికిత్స పొందుతున్న లక్ష్మీరెడ్డి

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు గంగాపాలెం గ్రామానికి చెందిన గాయం లక్ష్మీరెడ్డి స్థానిక ఇండియన్ పెట్రోల్ బంకులో పని చేస్తుంటాడు. డ్యూటీ ముగించుకొని గ్రామానికి వెళ్తున్న సమయంలో కొత్తపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి ముళ్ళకంచెలోకి దూసుకెళ్ళాడు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. 108 వాహనంలో ఏరియా వైద్యశాలలో చేర్చి చికిత్స అందించారు. ప్రమాదంపై ఏటువంటి సమాచారం లేదని ఎస్ఐ చౌడయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన ఎర్రగొండపాలెంలో శనివారం రాత్రి చోటుచేసుకొంది. బాధితురాలి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు, మండలంలోని గుర్రపుశాల గ్రామానికి చెందిన శింగారపు సంజీవయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య పెద్ద కోటమ్మ, రెండోవ భార్య చిన్న కోటమ్మ (56)లు ఉన్నారు. వీరు ఇరువురు మొదటి భార్య కుమారుడు చెన్నయ్యతో ఎర్రగొండపాలెం పనుల నిమిత్తం శనివారం రాత్రి వై.పాలెం వచ్చారు. పనులు ముగించుకొని గ్రామానికి వెళుతున్న సమయంలో ద్విచక్రవాహనంపై నుంచి ముగ్గురు జారిపడ్డారు. వీరిలో మధ్యలో ఉన్న చిన్నకోటమ్మ తీవ్రంగా గాయపడింది. గాయపడిన చిన్న కోటమ్మను ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమచికిత్స అనంతరం వినుకొండ తరలిస్తున్న సమయంలో మార్గమధ్యలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. చౌడయ్య తెలిపారు.

హెల్మెట్లపై అవగాహన ర్యాలీ


రాచర్లలో హెల్మెట్లతో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

గిద్దలూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాచర్లలో పోలీసులు హెల్మెట్ పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. పోలీసులు హెల్మెట్లు ధరించి మోటార్ సైకిళ్లపై ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ అవసరం పై మోటార్ సైక్లిస్టులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణాన్ని రక్షించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ జె.రామకోటయ్య, ఎస్సై కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడాలి


మొక్కనాటుతున్న నారాయణరెడ్డి

గిద్దలూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు బి.ఎస్.నారాయణరెడ్డి అన్నారు. అంతర్జాతీయ ధ్యానదినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మొక్కలునాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈకార్యక్రమంలో కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ హబీబ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ

మార్కాపురం వన్‌టౌన్, డిసెం బరు 22 ఆంధ్రజ్యోతి: మార్కాపురం పట్టణ మార్కండేశ్వర పద్మశాలియా బహోత్తమ సేవా సంఘం నూతక కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో నూతన అధ్యక్షులుగా గంజి రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా కె.ఆదినారాయణ, కోశాధికారిగా జి.గోపినాథుడు, ఉపాధ్యాక్షులుగా శ్రీరామ చంద్రమూర్తి, విజయసారథి, ఈశ్వరయ్యలు ఎన్నికయ్యారు. కోశాధికారులుగా పవన్, నాగేంద్ర, సహాయ కార్యదర్శులుగా సుబ్బయ్య, కిశోర్, మరో 18 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

పురందేశ్వరికి సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరిని ఆ పార్టీ నాయకులు సత్కరించారు. ఆదివారం ఒంగోలుకు వచ్చిన ఆమెను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి ఆధ్వర్యంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి బొకే అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు అంశాలను పురందేశ్వరి దృష్టికి తీసుకెళ్ళారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్యయాదవ్, బొద్దులూరి ఆంజనేయులు, డాక్టర్ నర్సింగరావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి లక్ష తులసీదళార్చన


లక్ష తులసీదళ అర్చనలో చెన్నయ్య మూలవిరాట్

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 22 ఆంధ్రజ్యోతి: మార్కాపురంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామికి ధనుర్మాసం పురస్కరించుకుని ఆదివారం లక్ష తులసీదళార్చన నిర్వహించారు. శ్రీజగద్గురు ఆదిశంకరాచార్య బ్రాహ్మణ అర్చక పురోహిత ఋత్విజుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని లక్ష దళార్చన నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో గోపూజ, చెన్నకేశవస్వామి మూలవిరాట్, శ్రీదేశిభూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. అనంతరం వేద పండితుల వేద పఠనం మధ్య మహిళలు తులసి దళార్చన నిర్వహించారు. చెన్నకేశవ స్వామి పాదల చెంత తులసీదళాలు సమర్పించారు.


తులసీదళ అర్చనలో పాల్గొన్న భక్తులు

కునారిల్లుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు

- ఆరుబయటే సమావేశాలు
- సరైన వసతులు లేక ఇబ్బందులు
- వెంటాడుతున్న సిబ్బంది కొరత


వై.పాలెంలో సెక్టార్ కార్యాలయం వెలుపల కూర్చున్న అంగన్‌వాడీలు

ఎర్రగొండపాలెంరూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చంటిబిడ్డలకు గర్భిణులకు పౌష్టికాహారం అందించి వారికి ఆలంభన నిలిచే అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువయ్యాయి. వై.పాలెం సీడీపీవో కార్యాలయంలో పరిధిలో కనీసం మూడో వంతు కూడా సొంత భవనాలు లేవు. ఉన్న భవనాలో కూడా వసతులు కరువవ్వడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.


వెంకటాద్రిపాలెంలో కేంద్రం చుట్టూ ఏర్పాటు చేసిన కంచె

ఎర్రగొండపాలెం సమగ్ర శిశు సంక్షేమ శాఖ సెక్టార్ పరిధిలో మొత్తం 248 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 235 మంది కార్యకర్తలు, ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల ఊసే లేకుండా పోయింది. ఇక వారి సమస్యలు కూడా పట్టించుకోలేదు. దీంతో నేటికీ అవి సరైన వసతులు లేక కునారిల్లుతున్నాయి.

సొంత భవనాలు లేక అవస్థలు

సెక్టార్ పరిధిలో 248 కేంద్రాలు ఉండగా వాటిలో 90 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన 158 కేంద్రాలు అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. 248 కేంద్రాలకు గాను 11 మంది సూపర్ వైజర్లు ఉండాల్సి ఉండగా కేవలం ఐదుగురే ఉన్నారు. దీంతో ఆయా కేంద్రాల పర్యవేక్షణ తదితర వాటికి సూపర్ వైజర్లపై పనిఒత్తిడి పెరిగిపోయింది. అలాగే సెక్టార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సెక్టార్ ప్రధాన కార్యాలయానికి ప్రహరీ లేకపోవడంతో మహిళలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో ఆ ప్రాంత మంతా మందుబాబులకు అడ్డాగా మారుతోందని సిబ్బంది వాపోతున్నారు. ప్రహరీగోడ నిర్మించి సమస్యను తీర్చాలని సిబ్బంది కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో నిధులు మంజూరు

పంచాయితీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధ్వర్యంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 90 భవనాలకు గాను 82 కేంద్రాలకు రూ.15వేలు నిధులతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. అలాగే కేంద్రాలలోని పిల్లల రక్షణ కోసం 72 కేంద్రాలకు రూ.10వేల నిధులతో కంచె, గార్డెన్ ఏర్పాటు చేస్తున్నారు. 71 కేంద్రాలకు మంచినీటి వసతి కల్పనకు పనులు 80 శాతం పనులు పూర్తి అయినట్లు ఆయా శాఖల అధికారులు తెలిపారు. ఉన్న భవనాల్లో వసతులు కల్పిస్తున్నప్పటికీ, సొంత భవనాల కొరత మాత్రం ఆశాఖను వెంటాడుతూనే ఉంది.

జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

సెక్టార్ పరిధిలో అద్దె భవనాలపై, ప్రధాన కార్యలయ ప్రహరి గోడ, సిబ్బంది కొరత విషయంపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళినట్లు ఇన్‌చార్జీ సిడీపీఓ పద్మావతి తెలిపారు. త్వరలో నిధులు మంజూరు చేసి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

ఇన్‌చార్జ్ సీడీపీవో పద్మావతి

మిర్చి పైరుకు తెగుళ్ల బెడద


పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

పెద్దదోర్నాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో ఏర్పడిన మార్పులతో పంటలను తెగుళ్ల బెడద వెంటాడుతోంది. ఎన్ని పురుగుమందులు వినియోగించినా తెగుళ్ల నివారణ కావడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నెల రోజులుగా తరచూ మంగు వాతావరణం ఉండడంతో పైర్లకు తెగుళ్ల ఆశిస్తున్నాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు కర్షకులు నానా అగచాట్లు పడుతున్నారు.

ఆందోళనలో రైతన్నలు

విపరీతంగా పురుగు మందులు వినియోగిస్తూ పిచికారి చేస్తూ అధిక భారాన్ని మోస్తున్నారు. అయినా తెగుళ్ల అదుపులోకి రాలేదని రైతులు వాపోతున్నారు. చివరికి వర్షాధారంగా సాగు చేసే మినుము, పప్పు శనగ, జొన్న, ఆముదం పంటలకు కూడా రెండు మూడు సార్లు మందులు వినియోగించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మిరప తోటలపై వాతావరణ ప్రభావం

మిరపను నలిపేస్తున్న నల్లి

మండలంలో ప్రధానంగా మిరపను అధిక విస్తీర్ణంలో సాగుచేస్తున్నారు. సాగుచేసిన మిరప పైరును నల్ల నల్లి ఆశించి నలిపేస్తోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఆరుగాలం కష్టించి పంట దశకు తెచ్చుకున్న మిరపకు నల్లి సోకడంతో ఆకులన్నీ ముడుచుకు పోయి చివర్లు ఎర్రగా మారి పూత, పిందె నేల రాలుతోంది. చెట్లు పచ్చదనం, నునుపును కోల్పోయి నిర్జీవంగా తయారవడంతో ఏమి చేయాలో పాలుపోక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే సమయంలో రైతుల వద్దకు కొత్త కొత్త కంపెనీలు ప్రతినిధులు వచ్చి వారి మందులను అంటగడుతున్నారు. దీంతో వేలకు వేలు అదనంగా ఖర్చు చేస్తూ రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు.

ప్రభుత్వమే మెడికల్ కళాశాల నిర్మించాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతల డిమాండ్
- సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డికి వినతి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మెడికల్ కళాశాల నిర్మాణ పనులను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ సీపీఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు అందె నాసరయ్య, సీపీఎం నాయకులు సోమయ్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సైదాలు మాట్లాడుతూ, మార్కాపురంలో మెడికల్ కళాశాల నిర్మాణాన్ని ప్రభుత్వం నిలిపివేయడం తగదన్నారు. జిల్లా వైద్యశాలలో పనిచేస్తున్న వైద్యుల బదిలీని వ్యతిరేకించారు. ప్రభుత్వ నిర్వాహణలో మెడికల్ కళాశాలను వెంటనే ప్రారంభించాలన్నారు. మార్కాపురంలో మెడికల్ కళాశాల ఆవశ్యకతపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. కళాశాల విషయంపై ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సీఎం వద్దకు అఖిల పక్ష ప్రతినిధులను తీసుకెళ్లాలన్నారు. అనంతరం మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా అందె నాసరయ్య, కోకన్వీనర్‌గా డీకేఎం రఫీ, సోమయ్య, సైదా, సుదర్శన్, రజాక్, ప్రభాకర్, రాజు, మోసేలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శ్రీరాములు, వెంకటేశ్వర్లు, కేవీపీఎస్ నాయకులు రాజు, రూబెన్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి చెందిన పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి అందజేశారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐదుగురికి రూ.2.73 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. చెక్కులు పొందిన వారిలో బత్తుల నాగేంద్ర బాబుకు రూ.76,700, రెడ్డెబోయిన శ్రీనివాసులుకు రూ.43,300, పల్లెకొండ శైలజకు రూ.51,500, కటకం వెంకటరెడ్డికి రూ.37,192, దండబోయిన వెంకటేశ్వర్లుకు రూ.64,809 విలువైన చెక్కులను వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అత్యవసర మెరుగైన వైద్యం ప్రైవేటు వైద్యశాలల్లో పొందినవారికి అయిన ఖర్చును సీఎం చంద్రబాబు నాయుడు చెల్లిస్తున్నారన్నారు. పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గస్థాయిలో పార్టీ సభ్యత్వ నమోదులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురిని సన్మానించి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కనిగిరి బాలవెంకటరమణ, సయ్యద్ గఫార్, మయూరి ఖాశిం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం


గణిత ఉపకరణాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు ఉపాధ్యాయులు

కంభం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసరామానుజన్ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఉర్దూ డీఐ మొయినుద్దీన్ పాల్గొని గణిత ప్రాముఖ్యతను, నిత్య జీవితంలో గణితశాస్త్ర ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. గణిత నమూనాలు విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామానుజన్ జయంతి

గిద్దలూరు : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ దళిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు నిర్వహించారు. గణిత శాస్త్రం అనేది అభ్యాసం మాత్రమే కాదని, ఆలోచనకు అద్భుతమైన రీతిని అందించే శాస్త్రమని జేవీవీ రాష్ట్ర నాయకులు పి.స్వరూపారెడ్డి పేర్కొన్నారు. అందుకే శ్రీనివాస రామానుజన్ జయంతిని జాతీయ గణిత దినోత్సవంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు వడ్డీలేని రుణాలు


రుణాలు అందజేస్తున్న వాసవి జాగృతి క్లబ్ ప్రతినిధులు

గిద్దలూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరులో వాసవి జాగృతి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నూతన క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు డాక్టర్ తిరువీధి వేణుగోపాల్ నూతన క్లబ్‌ను ఆవిష్కరించారు. ఐదుగురు చిరువ్యాపారులకు ఒక్కొక్కరికి రూ.10వేల వంతున వడ్డీలేని రుణాలను అందచేశారు. అలాగే పలువురు నిరుపేద కుటుంబాల వారికి దుస్తులు పంపిణీ చేశారు. వైశ్యులతోపాటు సమాజం లోని అన్ని వర్గాలకు సేవా కార్యక్రమాలు అందించాలని సూచించారు. కులాంతర వివాహాలపై మోటివేషన్ క్లాస్ అందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు నాదెళ్ళ శ్రీనివాసులు, సూరె చెంచయ్య, బాదం వెంకటేశ్వర్లు, కోటా శ్రీనివాసులు, గర్రె సత్యనారాయణ పాల్గొనగా నూతన క్లబ్ అధ్యక్షులుగా శివపురం హరిక్రిష్ణ, కార్యదర్శిగా కోటా క్రిష్ణయ్య, కోశాధికారిగా ఎం.సత్యనారా యణ ప్రమాణస్వీకారం చేశారు

బస్‌షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు

కంభం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కంభంలో ఆర్టీసీ బస్టాండ్ ఉండగా కందులాపురం కూడలిలో కనీసం బస్‌షెల్టర్ కూడా లేదు. దీనితో ప్రయాణికులతోపాటు విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

కందులాపురం పంచాయతీ పరిధిలో దాదాపు 15 పైగా విద్యాసంస్థలు, పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. కందులాపురం కూడలి నుంచి మార్కాపురం వెళ్లేందుకు ఇంజనీరింగ్ విద్యార్థులు, ఉద్యోగులు బస్సు కోసం వేచి ఉండాలంటే బస్‌షెల్టర్ లేకపోవడంతో చుట్టూ ఉన్న దుకాణాల ముందు నిలబడాల్సి వస్తోం ది. 50 ఏళ్ల క్రితం కందులాపురం సెంటర్‌లో నిర్మించిన బస్‌షెల్టర్ ఆక్రమణకు గురి కావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. నిత్యం వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు బస్సుల కోసం వేచి ఉంటారు. వర్షం కురిసినా, ఎండ కాసినా లగేజీలతో దుకాణాల ముందు పడిగాపులు కాస్తుంటారు. కందులాపురం కూడలిలో ఉన్న పంచాయతీ స్థలాలను పలువురు ఆక్రమించి దుకాణాలు, ఏర్పాటు చేసుకోవడంతో ప్రయాణికులు నిలబడేందుకు స్థలం లేకుండా పోయింది. పంచాయతీ అధికారులు ఆక్రమణలను చూసీ చూడనట్లు ఉండడంతో ఆక్రమణదారులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అధికారులు స్పందించి కందులాపురం సెంటర్‌లో, అర్ధవీడు వెళ్లే మార్గంలో, తర్లుపాడు, మార్కాపురం దారిలో పంచాయతీ స్థలాలలో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు.

ప్రారంభంకాని మరుగుదొడ్లు

వందలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడే కందులాపురం కూడలిలో మరుగుదొడ్డి సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు అత్యవసర సమయంలో మూత్రవిసర్జన చేసేందుకు కందులాపురం పంచాయతీ ఏడాది క్రితం ప్రజా మరుగుదొడ్లు నిర్మించింది. అవి నేటికీ ప్రారంభించక పోవడంతో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మరుగుదొడ్లు లేకపోవడంతో ముఖ్యంగా మహిళా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి నిర్మాణం పూర్తయిన ప్రజామరుగుదొడ్లను ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.


కందులాపురం బస్టాప్ వద్ద వేచి ఉన్న ప్రయాణికులు

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట

గిద్దలూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ బడ్జెట్‌లో సైతం నిధులు కేటాయించిందని ఆల్ మదద్ ఫౌండేషన్ చైర్మన్ అరుసమల్ల రహీమ్ అన్నారు. స్థానిక బిలాల్ మసీదు ఆవరణలో ముస్లిం మైనారిటీ అభివృద్ధి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మసీదుల్లో పని చేసే ఇమామ్‌లు, మౌజన్‌ల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రహీమ్ మాట్లాడుతూ ఎటువంటి ఆదాయంలేని మసీదులు రాష్ట్రంలో చాలా ఉన్నాయని, అర్హత ఉన్న ప్రతి మసీదులో పని చేసే వారికి గౌరవ వేతనాలు అందించాలని కోరారు. తమ ఫౌండేషన్ ద్వారా ఉర్దూ, అరబిక్ భాషల ఏడాది కోర్సులు నిర్వహించి సర్టిఫికేట్లు అందచేస్తున్నామని పేర్కొన్నారు. ముస్లిం మైనారిటీ అభివృద్ధి సంక్షేమ సంఘం అధ్యక్షులు గుడిసె మహబూబ్‌భాషా మాట్లాడుతూ మసీదుల్లో పని చేసే ఇమామ్, మౌజన్‌లకు గత 9 నెలలుగా గౌరవ వేతనాలు రాలేదని, వేతనాలు త్వరగా విడుదల చేసి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతి మసీదు మెయింటేనెన్స్ కొరకు ప్రతినెలా 5వేల రూపాయలు మంజూరు చేసే విధంగా జిఒ విడుదల చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘం ప్రతినిధులు జప్రుల్లాఖాన్, గోల్కొండ చాంద్‌భాషా, హుస్సేన్‌ఖాన్, సయ్యద్ పీరాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఖురాన్ కంఠస్థ పోటీలు


విజేతలకు బహుమతులు అందచేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ ఆధ్వర్యంలో స్థానిక చిన్నమసీదులో 12 ఏళ్లలోపు బాలబాలికలకు ఖురాన్ కంఠస్త పోటీలు నిర్వహించారు. ప్రీ క్వార్టర్ ఫైనల్ పోటీలను ఆదివారం నిర్వహించారు. 50 మంది బాలబాలికలు పోటీల్లో పాల్గొనగా ప్రతిభ కనపరచిన 18 మంది బాలబాలికలకు బహుమతులు అందజేశారు. తదుపరి పోటీల కోసం వీరిని మార్కాపురం పంపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మౌలానా అబ్దుల్‌రషీద్, అబ్దుల్‌హుక్, ఎం.డి.రఫి, అక్బర్‌అలీ, ఖాదర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకట నారాయణ


ఎన్నికైన జనరల్ మర్చంట్ అసోసియేషన్ నూతన కమిటీ

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం ది జనరల్ మర్చంట్స్ అసోషియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా నటుకుల వెంకట నారాయణ, కార్యదర్శిగా గజ్వల్లి శ్రీరాములు, ట్రెజరర్‌గా గుర్రం శ్రావణ్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధ్యక్షులు నారాయణ తెలిపారు. వారితో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


మాట్లాడుతున్న బెంజిమెన్

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సంస్థ కార్యాలయంలో సెమీక్రిస్మస్ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో మార్పు కోసం చేసే పనిలో నిజమైన ఆనందం, సంతోషం ఉంటుందని సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనంద్ బెంజిమెన్ అన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి సంస్థ ఉద్యోగులకు పంచారు. సిబ్బందికి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయ్ కుమారి, ఝాన్సీరాణి, ఏ.లూకా, ఎరిక్సన్ పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయబ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ అమ్మవారికి సాధారణ , గోత్రనామ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జి.వాసు బాబు, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురు బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు. పూర్వపు ఈవో కార్తీక్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఘనంగా రామానుజన్ జయంతి

తాళ్లూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏబీసీ ఉన్నత పాఠశాలలో రామానుజన్ జయంతి ఉత్సవాలను కరస్పాండెంట్ టి.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితంను కష్టంగా కాకుండా ఇష్టంగా చూడాలన్నారు. విద్యార్థులు గణితంలో పట్టుసాధించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ముందుగా రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భగవద్గీతపై విస్తృత ప్రచారం

దొనకొండ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసాన్ని పురస్కరించుకొని త్రైత సిద్ధాంతం ప్రబోద సేవా సమితి దొనకొండ మండల కమిటీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన భగవద్గీత అనుబంధం ఆధ్యాత్మిక గ్రంథాలను మండలంలోని బ్రహ్మారావుపేట, వీరవెంకటాపురం, బాదాపురం, రామిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆదివారం విస్తృతంగా ప్రచారం చేపట్టారు. సేవా సమితి కమిటీ అధ్యక్షుడు ఏడుకొండలు మాట్లాడుతూ మార్గశిర మాసంలో భక్తిశ్రద్ధలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఏ.చెన్నకేశవులు, ఏ.బాలరంగయ్య, సుబ్బులు, వైష్ణవి, కాశీలక్ష్మి, టి.ఆదిలక్ష్మి, కొండమ్మ, బి.సీతమ్మ, జి.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి మహిళ మృతి

ముండ్లమూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం గ్రామానికి చెందిన సాధు అంజమ్మ(40) అనే మహిళ పురుగుల మందు తాగి ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. ఈనెల 12న పురుగు మందు తాగటంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఏఎస్ఐ పీవీ హనుమంతరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అంజమ్మ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

డ్రైవర్ చాకచక్యంతో తప్పిన ప్రమాదం



విరిగిన ఆర్టీసీ బస్సు చక్రం

పామూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు డ్రైవర్ చాకచక్యంతో ప్రయాణికులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఒంగోలు డిపోకు చెందిన బస్సు ఆదివారం మధ్యాహ్నం పామూరు నుంచి 20 మంది ప్రయాణికులతో ఒంగోలుకు బయలుదేరింది. పామూరులోని కందుకూరు రోడ్డు మార్గంలో గల పాల డెయిరీ ప్రాంతానికి రాగానే బస్సు ముందు టైరు రిమ్ విరగడంతో టైరు ఊడి పక్కనపడింది. పరిస్థితిని గమనించిన డ్రైవరు చాకచక్యంతో బస్సును నిలిపివేశాడు. ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సీసీ రోడ్డుతో తొలగిన ఇబ్బందులు

సీఎస్‌పురం(పామూరు) డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సీఎస్‌పురం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణను గత పాలకులు పట్టించుకోలేదు. దీంతో వర్షాలు పడినప్పుడు బురదమయంగా మారి ప్రాంగణంలోకి ప్రయాణికులు వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆసమస్య తీరింది. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చొరవతో ఉపాధి నిధులతో సీసీ రోడ్డు నిర్మించారు. ఈ సిమెంటో రోడ్డును ఆదివారం డాక్టర్ ఉగ్ర ప్రారంభించారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

- గత వైసీపీ పాలనలో అధ్వానంగా మారిన వైనం
- కూటమి ప్రభుత్వంలో నిధుల వరద
- తాళ్లూరు మండలంలో 58 పనులకు రూ.3 కోట్లు మంజూరు



శివరాంపురం ఎస్సీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు



తాళ్లూరు బీసీ కాలనీలో జరుగుతున్న రోడ్డు నిర్మాణపనులు

తాళ్లూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టింది. గత వైసీపీ ప్రభుత్వంలో స్థానిక సంస్థలు నిర్వీర్యమయ్యాయి. గ్రామాల్లో ఒక్క రోడ్డు నిర్మాణం కూడా చేపట్టలేదు. దీంతో గ్రామాల్లోని రహదారులు గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో మురికికూపాలుగా మారాయి. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పల్లెల్లో పండుగ వాతావరణం తీసుకువచ్చారు. పల్లె పండుగ పేరుతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, సైడు కాలువల నిర్మాణాలతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రత్యేక కృషితో మండలంలోని 16 పంచాయతీల్లో సీసీ రోడ్లు, సైడు కాలువ నిర్మాణం వంటి 58 పనులకు రూ.3 కోట్లు మంజూరు చేయించారు. నాలుగైదు గ్రామాల్లో మినహా మిగిలిన అన్ని గ్రామాల్లో పనులు చకచకా సాగుతున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరుకాక ఆపార్టీ సర్పంచ్‌లు కూడా అసహనం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో పంచాయతీల్లోని రహదారులు, సైడుకాలువ పనులు జరుగుతుండటంతో తమ పదవీ కాలం ముగిసేలోపు గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని వైసీపీ సర్పంచ్‌లే హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 24 పనులు పూర్తికాగా, మిగిలిన పనులు నిర్మాణ దశల్లో ఉన్నాయి. గ్రామీణప్రాంతాల్లో అంతర్గత రోడ్లు మునుపెన్నడూ లేనంతగా చకచకగా జరుగుతుండటంతో కూటమి ప్రభుత్వంలో ప్రజల కష్టాలు తొలుగుతున్నాయని గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాలనీలో రోడ్డుకు మోక్షం

- అనపర్తి ఎఫ్రయిమ్, శివరాంపురం



శివరాంపురం ఎస్సీ కాలనీలో రోడ్డు దుస్థితిలో ఉన్నా గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం ఒక్క సీసీ రోడ్డు కూడా వేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంతర్గత రోడ్లనిర్మాణంపై దృష్టి సారించారు. నిధులు మంజూరుచేయగా, రోడ్డు నిర్మాణం చేశారు. దీంతో ఎస్సీ కాలనీ వాసుల కష్టాలు తొలగినట్లయ్యాయి.

హామీలు నెరవేరుస్తున్నారు

- జాష్టి శ్రీనివాసులు, తూర్పుగంగవరం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామాల్లో సీసీ రోడ్లు, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారు. ఆ హామీలను నెరవేరుస్తూ గ్రామాల్లో అంతర్గత రోడ్లు, సైడుల కాలువల నిర్మాణం, గోకులం వంటి పనులకు కోట్లాది రూపాయలు మంజూరుచేశారు. దీంతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. గ్రామాల్లో మౌలిక సదుపాలయాలు కల్పించటం అభినందనీయం.

త్వరితగతిన పూర్తిచేస్తాం

- ఎం.వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ, తాళ్లూరు



మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో అంతర్గత రోడ్లనిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా 58 పనులకు రూ.3 కోట్లు మంజూరయ్యాయి. రెండు మూడు గ్రామాలు మినహా అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించారు.

24 పనులు పూర్తికాగా మిగిలినవి నిర్మాణ దశల్లో ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకుల సమన్వయంతో పనులు ముందుకు సాగుతున్నాయి. సంక్రాంతి నాటికి అన్ని పల్లెల్లో పండుగ వాతావరణంలో రోడ్లకు శంకుస్థాపన కార్యక్రమాలు జరిగేందుకు కృషి చేస్తున్నాం.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతాయని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సీఎస్‌పురం మండలంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా సీఎస్‌పురంలో రూ.3 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను సర్పంచ్ శ్రీరాం పద్మావతితో కలిసి ప్రారంభించారు. అనంతరం మండలంలోని చింతపూడులో గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రాంభించారు. ఈసందర్భంగా 80 శాతం రాయితీపై శనగ విత్తనాలు, చావా సుబ్బయ్యకు రాయితి కింద ప్రెషర్ మిషన్‌ను అందజేశారు.



వసతి గృహ ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

సీనాగులారంలో జీవీఆర్ ట్రస్ట్ నిర్వాహకుడు శ్రీనివాస్ వర్మ ఆర్థిక సహకారంతో రూ.70 లక్షలతో నిర్మించిన బీసీ బాలుర వసతి గృహాన్ని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి ఎంఅంజలతో కలిసి ప్రారంభించారు.

అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఉగ్ర మాట్లాడుతూ పేదలను ఆదుకోవాలనే దాతృత్వం కలిగిన వ్యక్తి శ్రీనివాస్‌వర్మ అని కొనియాడారు. చింతపూడును మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, యారవ శ్రీను, మాజీ ఎంపీపీ తోడేటి పెద అల్లూరయ్య, ఎస్‌సీ మాలకొండయ్య, గోపి, బీజేపీ నిమోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, ఎంపీడీవో రంగసుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'వెలిగొండ'కు మోపాడు రిజర్వాయర్ అనుసంధానం

పామూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టుకు మోపాడు రిజర్వాయర్‌ను అనుసంధానం చేసి క్షామపీడిత నివారణకు కృషిచేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మోపాడు రిజర్వాయర్ వద్ద జరిగిన ప్రాజెక్టు సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య, వైస్‌చైర్మన్ ఎం.నరసింహారావు ఆత్మీయ పరిచయ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వెలిగొండ నీటిని మోపాడుకు అనుసంధానం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇరిగేషన్ మంత్రి రామానాయుడును కలిసి నివేదిక అందజేశానన్నారు. నియోజకవర్గంలోని సాగునీటి చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరుచేయాలని కోరినట్టు చెప్పారు. గత వైసీపీ పాలనలో ఇరిగేషన్ వ్యవస్థ నిర్వీర్యమైందని ధ్వజమెత్తారు. దొంగ బిల్లులు పెట్టుకొని నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. జైకో నిధులతో ప్రస్తుతం రూ.10 కోట్ల మేర పనులు జరిగాయన్నారు. చెరువు అభివృద్ధి పనులపై ఆయకట్టుదారులు కూడా దృష్టి సారించి పర్యవేక్షించాలని సూచించారు. రిజర్వాయర్ కట్ట బలోపేత పనులు చేపట్టాలని ఇరిగేషన్ డీఈని ఆదేశించారు. అనంతరం చైర్మన్, వైస్‌చైర్మన్‌లను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో టీడీపీ పామూరు, పీసీపల్లి మండలాల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, వేమూరి రామయ్య, నాగేశ్వరరావు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, కమ్మ ప్రసాద్, ఉడుతా కిశోర్, ఎం.హుసేన్‌రావు, మన్నం రమణయ్య, పచ్చా బాబు, జి.దశరథరాములు, కొండబాబు, సుబ్బయ్య, గోళ్ల మాల్యాద్రినాయుడు, గోళ్ల కేశవులు, అడుసుమల్లి నరసింహులు, వై.ప్రసాద్‌రెడ్డి, కొలూరి ఖాజారహంతుల్లా, రాజేష్, ఏఈ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న డాక్టర్ ఉగ్ర

సీఎం సహాయనిధి పేదవారికి భరోసా!

కనిగిరి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఆసరానిచ్చి భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఆదివారం వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి సీఎం సహాయం నిధి నుంచి రూ.19లక్షల 68వేల 731మేర చెక్కులను 9మందికి కనిగిరి నియోజకవర్గ పరిశీలకులు గోగడి నాగేశ్వరరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

వీరిలో గొరిగె లక్ష్మీప్రణతికి రూ.6 లక్షల చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలోని ప్రభుత్వ వైద్యశాలల్లో కూడా అన్ని రకాల వైద్య సేవలు అందించాలన్నదే తన లక్ష్యమన్నారు. సీఎం సహాయనిధి ద్వారా కొంతమందికైనా తగిన వైద్యం అందుతుంటే ఆనందంగా ఉన్నప్పటికీ ఏఒక్కరూ అనారోగ్యంతో తనువు చాలించకుండా చూసుకోవాలన్నదే తన సంకల్పమన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఏపీఆర్ఎస్ఏ డివిజన్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్



ప్రమాణస్వీకారం చేస్తున్న ఏపీఆర్ఎస్ఏ డివిజన్ కార్యవర్గం

కనిగిరి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీఆర్ఎస్ఏ కనిగిరి డివిజన్ నూతన అధ్యక్షుడు ఎం.శ్రావణ్‌కుమార్, ప్రధానకార్యదర్శి కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏపీఆర్ఎస్ఏ కనిగిరి డివిజన్ నూతన కార్యవర్గ కమిటీ ఏకగ్రీవంగా ఎంపికైంది. కార్యవర్గం ప్రమాణస్వీకారంలో వారు మాట్లాడుతూ ఏపీఆర్ఎస్ఏ యూనియన్ రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. విధుల నిర్వహణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను యూనియన్ పెద్దల ద్వారా ప్రభుత్వంతో చర్చలు జరిపి అండగా నిలబడుతుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు ఆదేశాల తో జిల్లా నాయకులు పిన్నిక మధుసూదన్‌రావు, ఆర్.వాసుదేవరావు, ఊతకోలు శ్రీనివాసరావు, బొల్లాపల్లి సత్యసాయి శ్రీనివాసరావులు ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు. డివిజన్‌లోని 13 మండలాలకు చెందిన ముఖ్యనాయకులు, సభ్యులు పాల్గొనగా ఎన్నికల అధికారిగా కె.వెంకటేశ్వరరావు వ్యవహరించారు. నూతన కార్యకర్గంలో 12 మందితో కూడిన డివిజన్ కమిటీని ఎంపిక చేశారు.

గెజిటెడ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కనిగిరి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గెజిటెడ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీఎన్జీవో సంఘం తాలూకా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి అన్నారు. స్థానిక ఎన్జీవో హోంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ వేతన సవరణను చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేసి ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ ప్రయోజనాలు, జీపీఎఫ్ మొత్తాలను, పోలీసు సిబ్బందికి సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని కోరారు. ఉద్యోగులు నెల ప్రీమియం కడుతున్నప్పటికి హెల్త్ కార్డులు పనిచేయటం లేదన్నారు. ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వశాఖల్లోని పోస్టులను, గ్రామ సచివాలయంలోని పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులకు పనిభారాన్ని తగ్గించాలని కోరారు. అనంతరం నూతనంగా ఏర్పడిన కార్యవర్గాన్ని అభినందించారు. ఈసందర్భంగా ఏవోగా పదోన్నతి పొందిన వెంకటస్వామిని ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గ సహాధ్యక్షుడు జక్రయ్య, ఉపాధ్యక్షులు మల్లిఖార్జున, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



వెంకటస్వామిని సన్మానిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఎంఈవోల సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి

కనిగిరి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవోల సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతిభా పరీక్షలు వచ్చే పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు.

విద్యార్థుల సామర్థ్యాన్ని ప్రతిభా పరీక్షల ద్వారా తెలుసుకుని ఏఏ పాఠ్యాంశాల్లో వెనుకబడి ఉన్నారో అర్థం చేసుకుని ఆయా పాఠ్యాంశాల్లో మంచి పట్టు సాధించేందుకు శిక్షణ పొందవచ్చునని రామిరెడ్డి చెప్పారు. కనిగిరి మండలంలోని వివిధ పాఠశాలల నుంచి పదో తరగతి విద్యార్థులు 500 మంది పరీక్షలు రాశారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన వారికి బహుమతులు అందజేస్తున్నట్టు చెప్పారు.

కార్యక్రమంలో ఎంఈవో ఆర్.శ్రీనివాసులు, జేవీవీ నాయకులు వి.మాలకొండారెడ్డి, యూటీఎఫ్ నాయకులు టి.రమణారెడ్డి, ఎం.రాము, ఎస్‌కే ఖాజా, మల్లికార్జున్, పి.నరసింహం తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐ విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న మెకానిక్‌లు

మోటార్ మెకానిక్‌లు నిజాయితీగా వ్యవహరించాలి

దొనకొండ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్ల చోరీలు చేసే దొంగలు వాటి పరికరాలు మార్చేందుకు ఎక్కువగా మెకానిక్‌లను ఆశ్రయిస్తుంటారని ఎస్ఐ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. అనుమానితులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి మెకానిక్‌లు నిజాయితీగా వ్యవహరించాలన్నారు. ఆదివారం దొనకొండలో జరిగిన నవ్యాంధ్ర టూవీలర్స్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వాహనాల మరమ్మతుల నిమిత్తం వచ్చేవారికి హెల్మెట్‌లను ధరించాలని అవగాహన కల్పించాలని మెకానిక్‌లకు సూచించారు.

సత్తెనపల్లికి చెందిన నవ్యాంధ్ర టూవీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు షేక్ సుభానీ టూవీలర్స్ మెకానిక్‌లు పాటించాల్సిన అనేక విషయాల గురించి వివరించారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సయ్యద్ ఆసిఫ్‌బాషా, కార్యదర్శిగా గోనా సాగర్, సహాయ కార్యదర్శిగా షేక్ కరీముల్లా, కోశాధికారిగా గౌస్‌బాషా, గ్రీన్ ఇండియా అధ్యక్షుడిగా షేక్ కరీముల్లా, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నీటి కుంటలా ప్రధాన రహదారి



కొచ్చెర్లకోటలో నీటికుంటలా దర్శనమిస్తున్న ప్రధాన రహదారి

దొనకొండ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్లకోట ప్రధాన రహదారి నీటికుంటలా మారింది. గ్రామంలోని నాల్గురోడ్ల కూడలిలోని మలుపు వద్ద కొన్ని నెలల క్రితం రహదారిపై పెద్దగుంత ఏర్పడింది. గత వైసీపీ పాలకులు రహదారుల మరమ్మతుల గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. నిత్యం వాహనాల రాకపోకలు జరుగుతుండటంతో గుంత మరింత పెద్దదయింది. మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారి కావటంతో అధికసంఖ్యలో వాహనాలు ఈ రహదారిపై ప్రయాణిస్తుంటాయి, రాత్రివేళల్లో వాహనచోదకులు ఆదమరిస్తే ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. వర్షం కురిస్తే గుంతలో నీరు నిలిచి రహదారి మొత్తం నీటి కుంటలా మారి వాహన చోదకులకు ప్రయాణం మరింత ఇబ్బందికరంగా మారింది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి నీటి కుంటలా దర్శనమిస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు చేస్తే చర్యలు

- మార్కాపురం మైనింగ్ అధికారి విష్ణువర్ధన్‌రావు

కనిగిరి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా గ్రామాల్లో ఇసుక మేటల్లో తవ్వకాలు చేస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని మార్కాపురం భూగర్భగనులశాఖ అధికారి విష్ణువర్ధన్‌రావు తెలిపారు. ఇసుక తోడేస్తున్నారు శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇసుక అవసరమైన వారు ఆయా గ్రామాల్లో తవ్వకాలు చేయాలంటే తప్పనిసరిగా సచివాలయంలో అనుమతితో పాటు తగిన రశీదు పొందాలని విష్ణువర్ధన్‌రావు పేర్కొన్నారు. ఒకసారి తవ్వకం చేపట్టి వాహనంలో నింపి రవాణా చేస్తే ఒక రశీదు మాత్రమే చెల్లుతుందన్నారు. ఒక రశీదుపై ఒకసారికి మించి తవ్వకాలు చేసినా, రవాణా చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

తవ్వకాల సమయంలో ఎలాంటి యంత్రాలను వినియోగించకుండా కేవలం మనుషుల ద్వారానే ట్రాక్టర్‌లు, ఎడ్లబండ్లు, ఇతర వాహనాల్లో నింపుకోవాలన్నారు. ఏ గ్రామంలో అయితే తవ్వకాలు చేస్తారో అదే గ్రామంలోని నిర్మాణాలకు మాత్రమే ఇసుకను వినియోగించాలన్నారు. అందుకు విరుద్ధంగా ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి, మరో ప్రాంతానికి, పట్టణానికి రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఇతర ప్రాంతాలకు చెందిన ఇసుక అవసరమైన వారు ప్రభుత్వం కేటాయించిన కనిగిరి ఇసుక స్టాకు పాయింట్ వద్దనే కొనుగోలు చేయాలని సూచించారు. స్టాకు యార్డులో టన్నుకు రూ.980 చెల్లించి రశీదు పొంది, అక్కడనుంచి అవసరమైన ప్రాంతానికి రవాణా మార్గపు రశీదు పొందాలన్నారు. ఇప్పటికే ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై రూ.4.35లక్షలు జరిమాన విధించినట్లు తెలిపారు. భూగర్భ గనుల శాఖ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కుమార్తెలకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన తండ్రి, కుమార్తె

మద్దిపాడు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లిలోని మహి ఆగ్రో గోడౌన్స్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ తండ్రికి తీవ్ర గాయాలు కాగా ఇద్దరు కుమార్తెలకు గాయాలయ్యాయి. విజయవాడ నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న స్కూటీని అదేమార్గంలో ప్రయాణిస్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో స్కూటీపై వెళ్తున్న పామూరు మండలం బొట్లగూడూరుకు చెందిన పత్తిబోయిన మనోహర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్కూటీపై ఉన్న చిన్నారులు ధాన్యశ్రీ, మేఘనశ్రీలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహనం ద్వారా చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఆరాధన మహోత్సవం


పామూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక విరాట్ నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో వెలసిన పరాశక్తి స్వరూపిణి ఈశ్వరిదేవి ఆరాధన వేడుకలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నొస్సం నాగేంద్రచారి తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా సామూహిక కుంకుమార్చన, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు రెవెన్యూ సదస్సు

పీసీపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరేడుపల్లి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ ఉష తెలిపారు. ఈసదస్సులో భూసమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరిస్తామని ఆమె తెలిపారు.

ప్రభుత్వ ఆదేశాలతో నిర్వహిస్తున్న ఈసదస్సులో రెవెన్యూ పరిధిలోని రైతులు పాల్గొని వారు ఎదుర్కొంటున్న భూ సమస్యలను దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.





హార్బర్‌లో జట్టీకి చేరిన బోట్లు

నిజాంపట్నం హార్బర్‌లో.. 3వనెంబర్ ప్రమాదసూచిక

రేపల్లె,డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నిజాంపట్నం హార్బర్‌లో ఆదివారం 3వనెంబర్ ప్రమాదసూచిక కొనసాగుతోంది. వేటకు వెళ్ళిన బోట్లన్నీ తిరిగి రావాలని వైర్‌లెస్‌సెట్ల ద్వారా అధికారులు ఆదేశాలు జారీచేశారు. సముద్రంలో అలల ఉధృతి అల్లకల్లోలంగా ఉండటంతో వాతావరణంలో చలితో కూడిన ఈదురు గాలులు వీస్తుండడంతో మత్స్యకారులంతా హార్బర్‌కు చేరుకున్నారు. వేటకు వెళ్ళిన బోట్లన్నీ జట్టీలకు పరిమితమయ్యాయి.


చీరాల: లూథరన్ ఎయిడెడ్ కళాశాలలో అధ్వానంగా ఉన్న ఆటస్థలం


రేపల్లె: జూనియర్ కళాశాల ఇండోర్ స్టేడియంలో పూర్తికాని పనులు

ఆంధ్రజ్యోతి ఫోకస్

క్రీడేల్

విద్యార్థులకు ఆటలు అవసరం.. శారీరక, మానసిక, దేహ దారుఢ్యానికి క్రీడలు దోహద పడతాయి.. అయితే జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సరైన క్రీడా మైదానాలు, వసతులు లేవు. ఆట స్థలాలు ఉన్న దగ్గర్ల పీడీలు లేరు.. పీడీలు ఉన్న కళాశాలలకు మైదానాలు లేవు. ఉన్నా కొన్ని ప్రాంతాల్లో గుంతలు, పిచ్చిచెట్లతో నిండి ఉన్నాయి. ఇంటర్‌మీడియట్ జూనియర్, సీనియర్ విద్యార్థులకు ఆటలపై ఆసక్తి ఉన్నా.. వారిని ప్రోత్సహించే పరిస్థితి లేదు. మొత్తంమీద ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో క్రీడలపై ఆర్భాటంగా ప్రకటనలు చేశారే తప్ప అందుకు అనుగుణంగా పరిస్థితులను కల్పించడంలో నాటి పాలకులు విఫలమయ్యారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం క్రీడల్ని ప్రోత్సహించేందుకు చర్యలకు ఉపక్రమించింది. క్రీడా కోటా కింద మూడు శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో క్రీడా మైదానాల దుస్థితి, వసతులపై ఆంధ్రజ్యోతి బృందం ప్రత్యేక కథనం.

- ఆటలు లేని కళాశాలలు
- మైదానాలున్న దగ్గర్ల అధ్వానం
- క్రీడా మైదానాల అభివృద్ధికి చెల్లుచీటి
- కొన్ని కాలేజీల్లో భర్తీ కాని పీడీ పోస్టులు
- క్రీడలకు దూరమవుతున్న ఇంటర్ విద్యార్థులు
- జూనియర్ కళాశాలల్లో క్రీడా సౌకర్యాలు కరువు
- గత ఐదేళ్లు ఒక్కపైసా ఇవ్వని వైసీపీ ప్రభుత్వం
- రేపల్లె కళాశాలలో రెండేళ్లుగా పూర్తికాని ఇండోర్ స్టేడియం
- 3 శాతం స్పోర్ట్స్ కోటా సరే.. సౌకర్యాలు కల్పించాలంటున్న విద్యార్థులు


చీరాల వైఏ మహిళ కళాశాలలో అధ్వానంగా ఉన్న ఆటస్థలం


బాపట్ల: సూర్యలంక రోడ్డులో క్రీడాప్రాంగణం లేని సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్, డిసెంబరు 22: ఉమ్మడి గుంటూరు జిల్లాలో 21, బాపట్ల జిల్లాలోని చీరాల పరిధిలో నాలుగు వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో దాదాపు 10 వేల మందికి పైగా విద్యార్థులున్నారు. అయితే చాలా కళాశాలల్లో క్రీడా మైదానాలే లేవు. అనేక జూనియర్ కళాశాలల్లో ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్లతోనే కాలం వెళ్లదీస్తున్నారు. కొన్ని కళాశాల్లో అయితే ఏళ్ల తరబడి పోస్టులు భర్తీకి నోచుకోవడంలేదు. గత ప్రభుత్వ హయాంలో క్రీడలపై ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమయ్యారు. గుంటూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సరైన ఆటస్థలం లేదంటే ఇక మండలాల్లోని పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పలు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జూనియర్ కళాశాలలను ప్రారంభించిన గత పాలకులు ఆ స్థాయిలో ఆట స్థలాలను ఏర్పాటు చేయలేదు. పీడీ పోస్టుల భర్తీ, ఆటల పరికరాలు, నిధులను మంజూరు చేయలేదు. అంతంతమాత్రం వసతులతోనే చాలా ప్రాంతాల్లో జూనియర్ కళాశాలలు నిర్వహిస్తున్నారు.

ఇక క్రీడ మైదానాలు ఏర్పాటు చేయటం సాధ్యపడే పరిస్థితి కనిపించడంలేదు. కొన్ని ప్రాంతాల్లో ఆటస్థలాలు అధ్వానంగా మారాయి. ఆటల పరికరాలు విద్యార్థులకు సక్రమంగా అందుబాటులో ఉండటం లేదు దీంతో ఆసక్తి ఉన్న విద్యార్థులు కూడా ఆటల్లో వెనుకబడుతున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న వారు ప్రైవేటుగా శిక్షణ తీసుకోవాలంటే ఖర్చుతో కూడుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి క్రీడలకు అనువైన వాతావరణం కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

- బాపట్ల సూర్యలంకరోడ్డులో సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను 1972లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు క్రీడా మైదానం లేదు. బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలోనే జూనియర్ కళాశాలతో పాటు 2014లో డిగ్రీ కళాశాల కూడా ఏర్పాటు చేశారు. దీంతో ఉన్న స్థలం మొత్తం భవన నిర్మాణాలకు సరిపోయింది. క్రీడలకు స్థలం లేకుండా పోయింది. ఆంజనేయ అగ్రహారం మున్సిపల్ పాఠశాల భవనంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను

(మిగతా 8వ పేజీలో)

ఆటలపై అలక్ష్యం..

గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కసారి కూడా జూనియర్ కళాశాలల విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు ప్రభుత్వం నిర్వహించలేదు. ఆటలకు అవకాశమే ఇవ్వలేదు. అసలు ఆటల అంశాన్నే వైసీపీ ప్రభుత్వంలో అటు పాలకులు, ఇటు అధికారులు ఆలోచన చేయలేదు. క్రీడా పరికరాల కొనుగోళ్లకు కూడా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆటలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని నాటి పాలకులు ఆర్భాటం చేశారు.. తప్ప కనీసం ఆట స్థలాలను కూడా మెరుగు పరచలేదు. ఉమ్మడి గుంటూ రు జిల్లాలో జడ్పీ ఉన్నత పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా మార్చినా 294 ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయలేదు.


రేపల్లె: జూనియర్ కళాశాల ప్రాంగణంలో అసంపూర్తిగా ఉన్న ఇండోర్ మినీస్టేడియం


బాపట్ల పట్టణంలోని ఎస్‌ఎన్‌పీ అగ్రహారం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాల భవనం

ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

- జిల్లా జడ్జి వైవీఎస్‌వీజీ పార్థసారథి

రేపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల కారణంగా ఖైదీలుగా మారిన మీరు సత్ప్రవర్తనతో నడుచుకుని మీ కుటుంబాలకు అండగా నిలవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి వైవీఎస్‌వీజీ పార్థసారథి అన్నారు. స్థానిక సబ్‌జైల్‌ను ఆదివారం ఆయన సందర్శించి ఖైదీల సౌకర్యాలు, ఆహార సదుపాయాలు, మెడికల్ సదుపాయలు, లీగల్ ఎయిడెడ్ సౌకర్యాలు, వారి కేసుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా న్యాయవ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. క్షణికావేశానికి గురైతే కుటుంబాల్లో ఆనందాన్ని కోల్పోతారని, ఇకనుంచైనా సత్ప్రవర్తనతో మెలిగి వారికి అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ లీలావతి, సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ, కె.వాణి, జైలు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా జూనియర్ కబడ్డీ జట్టు ఎంపిక

చెరుకుపల్లి,డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): జడ్పీహెచ్‌ఎస్ స్కూల్, గుళ్ళపల్లిలో బాలుర జూనియర్స్ కబడ్డీ జట్టు ఎంపిక జరిగింది. ఎంపిక ప్రక్రియలో 70మంది క్రీడాకారులు పా ల్గొన్నారు. వారిలో ప్రతిభ కలిగిన 12 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎస్.వీరప్పయ్యరెడ్డి (బాపట్ల), ఎస్ఎన్ దుర్గాసాయి (బాపట్ల), కె.గోపి (బాపట్ల), డి.మనోజ్‌కుమార్ (ఆర్‌బి పాలెం), ఎన్.ధనష్‌రెడ్డి (పొన్నపల్లి), పి.కార్తిక్‌రెడ్డి (పొన్నపల్లి), జే.విజయ్‌శివసాయి (చెరుకుపల్లి), ఎస్.మణికంఠ (చెరుకుపల్లి), టి.మణికంఠ (చెరుకుపల్లి), జీ.విజయభాస్కర్‌రెడ్డి (పొన్నపల్లి), కె.ప్రవీణ్‌కుమార్ (గుంటూరు), బి.యోగేంద్ర (గుంటూరు), జే.మోహన్‌చందు (చేబ్రోలు), ఎంపికైన వారిలో ఉన్నారు. జనవరి 3, 4, 5 తేదీలలో కర్నూలులో జరిగే 50వ అంతర్‌జిల్లా పోటీలలో పాల్గొంటారని కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ డి.నెల్లిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ కందుల వెంకటేశ్వరరావు, వైస్‌ప్రెసిడెంట్ అక్కల శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డి.నాగాంజనేయులురెడ్డి, సెలక్షన్ కమిటీ కోచ్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

మాఫియా మిలాఖత్

- ఇసుక మైనింగ్‌లో వైసీపీ, టీడీపీ నేతలు
- ప్రభుత్వ ఉచిత ఇసుక విధానానికి తూట్లు
- చక్రం తిప్పుతున్న అధికార పార్టీ నేత అనుచరుడు ఆర్‌ఆర్
- 150 టిప్పర్లు, 300 ట్రాక్టర్లలో నిత్యం తరలిపోతున్న ఇసుక


ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్న ప్రదేశం


చీరాల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఇసుక మాఫియా.. టీడీపీ, వైసీపీ నేతలు మిలాఖత్.. జెండాలు వేరు, పార్టీలు వేరైనా చీరాల నియోజకవర్గంలో ఇసుక మాఫియా కలిసికట్టుగా రాజ్యమేలుతోంది. పెట్టుబడి లేని సంపాదనగా ఇసుక తవ్వకం, తరలింపు చేపడుతున్నారు. అధికార పార్టీ ముఖ్యనేత అనుచరుడు ఆర్‌ఆర్ ఇసుక దందాపై గుత్తాధిపత్యానికి పావులు కదిపాడు. పలువురిపై కేసులు నమోదు చేయించడంతో వైసీపీకి చెందిన కొందరు జెండాలు మార్చారు. కొందరు వైసీపీలో ఉంటూనే తమ భూములను ఆర్‌ఆర్‌కు అప్పజెప్తున్నారు. ట్రాక్టర్, టిప్పరుకు ఇంత అని లెక్క కట్టి భూయజమానులకు చెల్లిస్తున్నారు. నియోజకవర్గంలో ఇసుకమాఫియా ప్రభుత్వ ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తోంది. వైసీపీ, టీడీపీ అనే భేదభావం లేకుండా రెండు పార్టీలకు చెందిన అక్రమార్కులు ఏకమై సహజవనరుల దోపిడీని యథేచ్ఛగా సాగిస్తున్నారు. వైసీపీ పోయి కూటమి ప్రభుత్వం వచ్చినా ఇసుక మాఫియా తీరు మారలేదని ప్రజలు మండిపడుతున్నారు. వైసీపీకి చెందిన పాత ముఖాలు, టీడీపీకి చెందిన కొత్త వారు కలిసి సాగిస్తున్న ఇసుక దందా కొత్త సీసాలో పాత సారాలా ఉందని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. 150 టిప్పర్లు, 300 ట్రాక్టర్లలో ఇసుక నిత్యం తరలిపోతున్నది. సుమారు రూ.అర కోటికిపైగా విలువైన ఇసుకను నిత్యం తరలిస్తున్నారు. మైనింగ్, పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నియమించిన మండల లెవల్ కమిటీలు కూడా పట్టించుకోలేదు. ఈ పరిణామాలను జీర్ణించుకోలేని కూటమి శ్రేణుల్లో అసంతృప్తి నివురుగప్పిన నిప్పులా ఉంది.

ఫ్లెక్సీలు వేద్దాం.. పైసలు పోగేద్దాం

ఏ పార్టీ అయితే మనకేంటి. మనం కూడా పార్టీ మార్చేద్దాం. మారినట్లు అందరికీ తెలిసేందుకు పెద్ద ఫ్లెక్సీలు వేద్దాం. పైసలు సంపాదించుకుందామనేది వైసీపీ నుంచి టీడీపీ పంచన చేరుతున్న వారిలో కొందరు అక్రమార్కుల వాదన. అక్రమ దందాల్లో పోటీ లేకుంటే సిండికేట్‌గా అందరూ కలిసి అడుగులు వేస్తే నాలుగు రూపాయలు అదనంగా సంపాదించుకోవచ్చనేది ఆర్‌ఆర్ మార్క్ పాలసీ. దీంతో పట్టా భూములు, ప్రభుత్వ భూములు, సొనలు అనే తేడా లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా సాగిస్తున్నారు.

జరిమానాలతో మమ..

ఇసుక అక్రమ దందాను వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కి, ఎన్‌జీటీ ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నారు. వీటిపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు అప్పుడప్పుడూ మొక్కుబడిగా ఇసుక ట్రాక్టర్లను ఆపి జరిమానా వేసి మమ అనిపిస్తున్నారు. ఎక్స్‌వేటర్లతో ఇసుకను తవ్వి తరలిస్తున్నా పట్టించుకోవడంలేదు.


పందిళ్లపల్లి సమీపంలోని పీఎస్ క్వారీ నుంచి అక్రమంగా ఇసుకలోడ్‌తో వస్తున్న టిప్పర్

సైబర్ నేరాలపై దృష్టి సారించండి

- సౌత్ కోస్టల్ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి



పర్చూరు: కారంచేడు పోలీసు స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఐజీ త్రిపాఠి, పక్కన ఎస్పీ తుషార్ డూడీ తదితరులు

చీరాలటౌన్/ పర్చూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టిసారించడంతోపాటు వాటిపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సౌత్ కోస్టల్ రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. చీరాల వన్‌టౌన్, పర్చూరు మండలం కారంచేడు పోలీస్ స్టేషన్‌లను ఎస్పీ తుషార్‌డూడీతో కలిసి ఆయన తనిఖీ చేశారు. అలాగే స్టేషన్‌లో ఏర్పాటు చేయనున్న కమాండ్ కంట్రోల్ రూంపై ఆరా తీశారు. ఇటీవల డిజిటల్ అరెస్టుల సంఖ్య అధికంగా ఉన్నట్లు వివరించారు. వాట్సాప్ కాల్స్ చేసి కస్టమ్స్, విజిలెన్స్, ఇతర శాఖల పేరుతో సామాన్యులకు బెదిరింపు కాల్స్ వస్తే స్టేషన్‌ను సంప్రదించి పరిష్కారం పొందాలని సూచించారు. కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేయడం వలన నేరాలు నియంత్రించవచ్చన్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. సముద్ర తీరంలో సైతం సీసీ కెమెరా నిఘా పెంచాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎండీ మొయిన్, సీఐ శ్రీనివాసరావు, ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, ఎస్సై వెంకట్రావు పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి
- తండ్రి పరిస్థితి విషమం
- తల్లికి తీవ్రగాయాలు


కుటుంబ సభ్యులతో ప్రవీణ్‌కుమార్ (ఫైల్)


అపస్మారక స్థితిలో ఉన్న భర్త, మృతి చెందిన కుమారుడిని చూసి ఘటనా స్థలంలో విలపిస్తున్న దివ్య

చీరాలటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మరో రెండు రోజుల్లో క్రిస్మస్ పండుగ. ఇద్దరు పిల్లలతో కలిసి ఆనందంగా చేసుకోవాలని ఆ దంపతులు భావించారు. నూతన వస్త్రాలు కొనేందుకు కుమారుడు, కుమార్తెను తీసుకొని ద్విచక్ర వాహనంపై చీరాలకు వచ్చారు. షాపింగ్ ముగించుకొని తిరుగు ప్రయాణమైన వారు రోడ్డు ప్రమాదం బారినపడ్డారు. తొమ్మిదేళ్ల కుమారుడు అక్కడికక్కడే మృతిచెందాడు. తల్లిదండ్రులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో తండ్రి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదం చీరాల ఆర్వోబీపై చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బాపట్ల మునిసిపల్ పరిధిలోని ఆనందనగర్‌కు చెందిన ఆరెతోటి ప్రవీణ్ కుమార్, దివ్య దంపతులు. ఆయన ప్రైవేటు ఎలక్ట్రిషియన్. ఆమె గృహిణి. వారి కుమార్తె జెస్సీ 6వ తరగతి, రాహుల్ (9) 5వ తరగతి చదువుతున్నారు. మరో మూడు రోజుల్లో క్రిస్మస్ పండుగ ఉండడంతో నలుగురూ ద్విచక్ర వాహనంపై చీరాలకు వచ్చారు. ముందుగా దివ్య పుట్టిల్లు పేరాల ఆనందపేట కావడంతో అక్కడికి వెళ్లారు. బంధువులతో కాసేపు ఆనందంగా గడిపారు. దుస్తులు కొనేందుకు వెళ్లి వస్తామని చెప్పి అక్కడి నుంచి వెళ్లారు. అనంతరం చీరాల్లో అందరూ నూతన వస్త్రాలు కొనుగోలు చేశారు. తిరిగి వెళ్లే సమయంలో ట్రాఫిక్ సమస్య ఉంటుందని ఆర్వోబీ వంతెనపై మీదుగా పేరాలగేటు వద్ద నుంచి బాపట్ల వెళ్లాలనే ఉద్దేశంతో ఆ మార్గంలో ప్రయాణించారు. పర్చూరు వైపు నుంచి చీరాలకు వస్తున్న చీరాల ఆర్టీసీ డిపో బస్ డ్రైవర్ పల్లెవెలుగు బస్సును ఓవర్‌టేక్ చేసి ఎదురుగా వస్తున్న ప్రవీణ్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. చిన్నారి బాలుడు రాహుల్‌పై నుంచి బస్ చక్రం వెళ్లింది. దీంతో ఆ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తలకు తీవ్రగాయమైన తండ్రి ప్రవీణ్ కుమారుడిపై చేయివేసి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దివ్య ముఖానికి బలమైన రక్త గాయాలయ్యాయి. జెస్సీ మాత్రమే క్షేమంగా బయటపడింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బస్‌డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రాహుల్ మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో చీరాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దివ్య చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతోంది. కుమార్తె జెస్సీకి ఎలాంటి గాయాలు లేవు.

తల్లిప్రేమను చూస్తూ తల్లడిల్లారు...

రోడ్డు ప్రమాదం అనంతరం తల్లి దివ్యను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడికి తీసుకెళ్లే సరికి ఆమె స్పృహ కోల్పోయింది. అయినప్పటికీ 'నా కొడుక్కి డ్రెస్ నచ్చిందా.. లేదంటే మరో డ్రెస్ కొంటాను' అని కలవరిస్తున్నట్లు మాట్లాడడం చూసిన బంధువులు, ఇతరులు కన్నీటి పర్యంతమయ్యారు. తల్లి ప్రేమను చూస్తూ తల్లడిల్లారు.

పాతవారికే పట్టం కట్టిన ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు

- అధ్యక్షుడిగా ముప్పలనేని, కార్యదర్శిగా మానం


ముప్పలనేని శ్రీనివాసరావు | మానం నాగేశ్వరరావు | కోట వీరబ్రహ్మయ్య

బాపట్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఎన్నికలలో తిరిగి అధ్యక్షుడిగా ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శిగా మానం నాగేశ్వరరావులను సభ్యులు ఎన్నుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి పోటాపోటీగా జరిగిన ఈ ఎన్నికలో ముప్పలనేని 10 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గతంలో ఆయనకు 31 ఓట్ల మెజార్టీ వచ్చింది. మూడుదశాబ్దాలుగా ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శిగా పని చేస్తున్న మానం నాగేశ్వరరావు 21 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గత ఎన్నికలలో ఆయనకు 48 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఈవిధంగా ఇద్దరికి మెజార్టీ తగ్గింది. సంయుక్త కార్యదర్శిగా పోటీ చేసిన దొడ్డపనేని వెంకయ్యచౌదరి 3 ఓట్లతో గెలుపొందారు. గత ఎన్నికలలో ఆయన ఒక ఓటు తేడాతో ఓడిపోయి ఈసారి గెలుపొందారు. ఉపాధ్యక్షుడు-2గా పారెపల్లి చంద్రశేఖర్ 8 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడు-1కు పోటీ చేసిన కొల్లా వీరయ్యచౌదరి, కారుమంచి వెంకట్రావులకు 69 ఓట్లు చొప్పున వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారులు మరోసారి ఓట్లు లెక్కించినప్పటికి ఇద్దరికి సమానంగా ఓట్లు రావటంతో ఇద్దరికి ఏడాదిన్నర చొప్పున పదవీ వచ్చేవిధంగా ఆమోదించారు. దీనికి వారు అంగీకరించినట్లు తెలిపారు. కోశాధికారిగా కోట వీరబ్రహ్మయ్య రెండు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈవిధంగా ముప్పలనేని ప్యానల్‌కు సంబంధించి కోశాధికారి పదవీ కోల్పోవటం జరిగింది. ఎన్నికల అధికారిగా డాక్టర్ జరుగుల సతీష్‌బాబు, సహాయ ఎన్నికల అధికారులుగా డాక్టర్ షేక్ నజీర్, డాక్టర్ సుధాకర్ వ్యవహరించారు.

మహిళా విజ్ఞాన న్యాయ అవగాహన సదస్సు

పిట్టలవానిపాలెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా విజ్ఞాన న్యాయ సదస్సును పిట్టలవానిపాలెం చందోలు జలవనరులశాఖ కార్యాలయంలోని ప్రభుత్వ బంగ్లాలో ఆదివారం నిర్వహించారు. ఈ న్యాయ సదస్సుకు న్యాయవాది కె.కాళీదాసు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి పాల్గొని మాట్లాడుతూ గృహహింస, మానవ అక్రమ రవాణ, ఫోక్సో చట్టం, లోక్ అదాలత్, బాల్య వివాహాల నిషేధం తదితర చట్టాలపై మండలంలోని మహిళా పోలీసులు, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, ఏఎన్‌ఎంలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఝాన్సీ, లీగల్ వలంటరీ పఠాన్ మహ్మద్‌ఖాన్, ఖాజీపాలెం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి.రాధ, ఏపీఎం సంతోష్ కుమార్, చందోలు ఏఎస్‌ఐ డేవిడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష తులసి..బిల్వార్చన



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

వేటపాలెం(చీరాల), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రావూరిపేటలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి వార్లకు ఆదివారం లక్ష తులసి, లక్ష బిల్వ పత్రాలతో మహా అర్చన నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

హిందూ ఆలయాలను రక్షించుకుందాం

పంగులూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : హిందూ ఆలయాల పరిరక్షణ కోసం తలపెట్టిన హైందవ శంఖారావం సదస్సుకు ప్రజలు తరలిరావాలని హిందూ ధర్మ పరిషత్ సభ్యులు పోలిశెట్టి హరిబాబు, కుక్కల నాగమల్లేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ముప్పవరం గ్రామంలో వీహెచ్‌పీ ప్రతినిధులు విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం సదస్సుకు ప్రజలు భారీగా తరలిరావాలని కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గరిమిడి జగన్మోహనరావు, ధూళిపాళ్ల భావనారయణస్వామి, మహిళా భక్తులు పాల్గొన్నారు.

ప్రైవేటు వ్యాపారాలు దండి

- శింగరకొండ ఆదాయానికి గండి
- పెరుగుతున్న ట్రాఫిక్ కష్టాలు
- దేవస్థాన అధికారుల ఉదాసీనత

అద్దంకి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండలో ప్రైవేటు వ్యాపారుల జోరు పెరగడంతో ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ఆదాయానికి గండి పడుతుంది. దాతల సహకారంతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దెలకు తీసుకునేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద ప్రైవేటు వ్యాపారులు ఏడాదికేడాది పెరిగిపోతున్నారు. దేవస్థానానికి అద్దెలు చెల్లించి వ్యాపారులు డజను మంది అయితే రోడ్లపై తోపుడుబండ్లు, చిన్న దుకాణాలు పెట్టుకొని వ్యాపారాలు చేసే వారు సుమారు 30 మందికి పైగానే ఉన్నారు. దీంతో లక్షల రూపాయల అద్దెలు చెల్లించి దేవస్థానం షాపులలో వ్యాపారాలు చేసుకునేందుకు వ్యాపారులు వెనుకడుగు వేస్తున్నారు. దేవస్థానం అధికారులు మరింత ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో ప్రైవేటు వ్యాపారుల సంఖ్య మరింత పెరుగుతోంది. ఎలాంటి అద్దెలను చెల్లించేది లేక పోవడంతో దేవస్థానంలో షాపుల కంటే పూజా సామగ్రి ధరలు ఒకింత తగ్గించి అమ్మకాలు చేస్తుండడంతో భక్తులు కూడా ప్రైవేటు వ్యాపారుల వద్దనే కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో దేవస్థానం షాపులలో దుకాణాలు నిర్వహించే వ్యాపారుల వ్యాపారం మరింత తగ్గి పరోక్షంగా దేవస్థానం ఆదాయానికి గండి పడుతుంది. దాతల సహకారంతో ఇటీవల నిర్మించిన దేవస్థానం షాపులు అద్దెకు తీసుకునేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో కొన్ని ఇంకా ఖాళీగా ఉన్నాయి. ప్రైవేటు వ్యాపారుల మధ్య పోటీతత్వంతో ఇటీవల ప్రైవేటు వ్యాపారుల మధ్య ఘర్షణలు కూడా జరిగాయి. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి తోపుడు బండ్లు పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడుతుంది. ఆర్టీసీ బస్సులు కూడా కొన్ని సమయాలలో నిలిచిపోతున్నాయి. ప్రధానంగా మంగళ, శని, ఆదివారం, ప్రత్యేక పండుగల రోజులలో రద్దీ మరింత ఎక్కువగా ఉండి భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు వ్యాపారులకు గ్రామస్థాయి నేతల అండదండలు ఉండడంతో దేవస్థానం అధికారులు కూడా తమకెందుకులే అన్న ధోరణితో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా దేవస్థానం అధికారులు స్పందించి ప్రైవేటు వ్యాపారాలు జరగకుండా చర్యలు తీసుకొని, దేవస్థానం ఆదాయం పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



దేవాలయం వద్ద రోడ్డుపై తోపుడు బండ్లు, ప్రైవేటు వ్యాపారుల దుకాణాలు

ప్రైవేటు వ్యక్తులు వ్యాపారాలు నిర్వహించకుండా చర్యలు

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం పరిసర ప్రాంతం లో ప్రైవేటు వ్యక్తులు వ్యాపారాలు చేయకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. దేవస్థానం ఆదాయం తగ్గడంతో పాటు, భక్తులకు మరింత ఇబ్బందిగా మారింది. వ్యాపారాలు నిర్వహించేందుకు ఉత్సాహం ఉన్న వ్యక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉన్న షాపులను టెండర్ ద్వారా కేటాయించడం జరుగుతుంది.

- తిమ్మానాయుడు, ఈవో, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం

విద్యాభివృద్ధికి ఉల్లాస్ ట్రస్ట్ ప్రోత్సాహం అభినందనీయం

అద్దంకి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి ఉల్లాస్ ట్రస్ట్ ప్రోత్సాహం అభినందనీయమని ఎంఈఓ 2 సుధాకరరావు, ఎస్సై ఖాదర్‌బాషా అన్నారు. ఉల్లాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం, చక్రాయపాలెం, పట్టణంలోని కాకానిపాలెం, గొరకాయపాలెం హైస్కూల్స్, ప్రకాశం ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం హైస్కూల్‌లలో 9, 10 తరగతులు చదువుతున్న 60 మందికి రూ.60వేల ప్రోత్సాహక నగదు, సర్టిఫికెట్‌లను ఎంఈవో సుధాకరరావు, ఎస్సై ఖాదర్‌బాషా అందజేశారు. రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు అవార్డు గ్రహీత చ క్రాయపాలెం హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ఆస్ట్రేలియాలో ఉంటున్న అడుసుమల్లి అనిల్‌కుమార్ రూ.25 వేల చెక్కును శ్రీనివాసరావుకు అందజేశారు. గోపు నారాయణ గుప్తా చక్రాయపాలెం హైస్కూల్‌కు రూ.5వేలను, గ్రంథాలయ సాధన కమిటీకి మానికొండ రవిశంకర్ రూ.2వేలు సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉల్లాస్ ట్రస్ట్ ప్రతినిధులు మానం రవిశంకర్, మానం రాము, ధనుంజయ్, ఆయా హైస్కూల్స్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొండయ్యకు జ్ఞాపికను అందజేస్తున్న దేవాంగ సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఐక్యతతోనే అభివృద్ధి

ఎమ్మెల్యే కొండయ్య పిలుపు

చీరాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఐకమత్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధించగలమని, అందరం కలసికట్టుగా ప్రయాణం చేస్తూ, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిబాటలో నడిపిద్దామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల పరిధిలోని దేవాంగపురి శ్రీ చౌడేశ్వరి దేవాంగ కల్యాణ మండపంలో బాపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం తృతీయ నూతన సంవత్సర క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం దేవాంగ సామాజికవర్గ నేతలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పలు అంశాలపై ఆయన మాట్లాడారు. పరస్పర సహకారంతో ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. నిర్వాహకులు ఎమ్మెల్యే కొండయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవాంగ ప్రతినిధులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణ గోశాలలో ..

పాపరాజుతోట శ్రీ కృష్ణ గోశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమాలో ఎమ్మెల్యే కొండయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆవిష్కరించారు. గోశాలకు తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో గోశాల ప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

కొత్తపేట(చీరాల), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మెరుగైన సేవలు అందించాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని తాజాగా నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఇతర కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే కొండయ్య సూచించారు. క్యాంపు కార్యాలయంలో ఆదివారం నూతనంగా ఎన్నికైన నీటి సంఘాల బాధ్యులు ఎమ్మెల్యే కొండయ్యను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని సన్మానించి అభినందనలు తెలిపారు. పదవల్లో ఉన్న మనపై ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా బాధ్యతగా పనిచేయాలని కొండయ్య సూచించారు. ప్రభుత్వ పరంగాను, వ్యక్తిగతంగాను తన సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నీటి సంఘాల బాధ్యులు, పలువురు నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో చినగంజాం అభివృద్ధి

చినగంజాం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో చినగంజాం మండల అభివృద్ధికి పాటుపడతానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయ్‌కుమార్, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబుతో కలిసి ఆదివారం రాత్రి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఏలూరి మాట్లాడుతూ దేశానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్య ఫలాలను అందించిన ఘనత అంబేడ్కర్‌కే దక్కుతుందన్నారు. చినగంజాం మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో ఉన్నట్లు చెప్పారు. ఓడల తయారీ పరిశ్రమకు, పోర్టు నిర్మాణానికి కృషికి చేస్తున్నట్లు తెలిపారు. మండలాన్ని టూరిజం హబ్‌గా, పరిశ్రమల హబ్‌గా రూపొందించి ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం చర్చి ఆవరణలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ఏలూరి పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, నాయకులు విక్రం వెంకటరావు, నక్కల వెంకటనారాయణ, ఎన్‌వీ రాఘవులు, వీరాస్వామి, డి.నాగరాజు, కత్తి లాజర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విధిగా హెల్మెట్‌లు ధరించాలి

చీరాలటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు విధిగా హెల్మెట్‌లను ధరించాలని చీరాల వన్‌టౌన్ సీఐ మారేడు శ్రీనివాసరావు అన్నారు. సీఐ ఆధ్వర్యంలో పట్టణ పురవీధులలో పోలీసులు హెల్మెట్‌లు ధరించి వాహనాలు నడిపి అవగాహన కల్పించారు. ర్యాలీలో ఎస్సైలు భాస్కరరావు, రాజ్యలక్ష్మి, శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఎస్సై పవన్ కుమార్ తదితర స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సంతమాగులూరు : హెల్మెట్ ఆవశ్యకతపై సీఐ కే వెంకట్రావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పట్టాభిరామయ్య, బల్లికురవ ఎస్‌ఐ చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీ డల్

(5వ పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నా పీడీ పోస్టు లేదు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో 160 మంది విద్యార్థులకు పీడీ ఉన్నా ఆట స్థలం లేదు. ప్రాంగణంలో టైల్స్ వేయడంతో దానిపై ఇసుక పోసి మొక్కుబడిగా ఆటలు ఆడిస్తున్నారు.

- చీరాల నియోజకవర్గ పరిధిలో నాలుగు ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో వందల సంఖ్యలో విద్యార్థులు ఉన్నారు. అయితే ఆయా కళాశాలల్లో ఆటస్థలాల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇక్కడ విద్యార్థులకు ఆటలకు అవకాశం లేకుండా పోయింది.

- వేమూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 1979-80లో ప్రారంభించగా అప్పటి నుంచి పీడీ పోస్టు లేదు. దీంతో విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి ఉన్నా ఆటలు ఆడించే వారు లేకపోవడంతో వారు నిరాశకు గురవుతున్నారు. పీడీ పోస్టు లేకపోవడంతో క్రీడలకు చెందిన ఎలాంటి వస్తువులు కూడా ప్రభుత్వం నుంచి మంజూరు కావడంలేదు. రేపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏడేళ్ల క్రితం పీడీ ఉద్యోగ విరమణ చేయగా అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. కళాశాలలో పెద్ద క్రీ డా మైదానం ఉన్నా 150 మంది విద్యార్థులకు క్రీడలు నేర్పించే పరిస్థితి లే దు. కనీసం ఆటలు ఆడుకునే పరికరాలు కూడా లేవు. కళాశాల ప్రాంగణంలో 2022లో అప్పటి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణారావు ఇండోర్ స్టేడియానికి శంకుస్థాన చే యగా ఇప్పటికీ నిర్మాణం పూర్తి కాలేదు. బేస్‌మెంట్, చుట్టూ ఐరన్ పిల్లర్స్, పైన కప్పు వేశారే తప్ప కింద భాగంలో కాంక్రీట్ వేయలేదు. ప్రహరీ నిర్మాణంతో పాటు విద్యుత్, తాగునీటి పైప్ లైన్లు వెయ్యాల్సి ఉంది. కాంట్రాక్టర్‌కు బకాయిలు చెల్లించకపోవడంతో ఇండోర్ స్టేడియం పనులు నిలిపివేశారు. మాచర్లలో ఎస్‌కేబీఆర్ జూనియర్ కళాశాలకు క్రీడా మైదానం ఉండగా ఆట పరికరాలు, పీడీ లేరు. దుర్గిలోని జూనియర్ కళాశాలకు క్రీడా మైదా నం లేదు. పీడీ లేరు. వినుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదేళ్ల నుంచి పీడీ పోస్టు భర్తీకి నోచుకోలేదు. విశాలమైన గ్రౌండ్ ఉంది. దీంతో కళాశాలలోని 450 మంది విద్యార్థులు క్రీడలపై మక్కువ చూపలేకపోతున్నారు. నూజెండ్ల మండలం ఉప్పలపాడులోని గురుకుల పాఠశాలలో క్రీడా మైదానం సక్రమం గా లేదు. పీఈటీ ఉన్నారు. దీంతో విద్యార్థులకు క్రీడా అవకాశాలు కోల్పోతున్నారు. మోడల్ స్కూల్‌లో కాంట్రాక్ట్‌పై పీఈటీ ఉన్నా ఆట స్థలాలు లేవు. సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా మైదా నం అధ్వానంగా ఉంది. పిచ్చి చెట్లు, గుంతలతో నిండి ఉన్న మైదానంలో విద్యార్థులు ఆటలాడేందుకు అవకాశం లేదు. పీడీ పోస్టు ఉన్నా అవసరమైన క్రీడా పరికరాలు లేవు. మైదానం అభివృద్ధికి సహకరించాలని ప్రిన్సిపాల్, పీడీలు ఇటీవల ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి కూడా తీసుకువెళ్లారు. పిడుగురాళ్ల, గురజాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో క్రీడా మైదానాలు అధ్వానంగా ఉన్నాయి. కళాశాలలకు ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు భర్తీకి నోచుకోవడంలేదు. దాచేపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆటస్థలం లేదు. పీడీ పోస్టు ఖాళీగా ఉంది. క్రీడా పరికరాలు ఉన్నా వినియోగించే వీలులేక బీరువాలో భద్రంగా ఉన్నాయి. పొన్నూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా సౌకర్యాలతో పా టు పీడీ పోస్టు ఏళ్లుగా భర్తీ కాలే దు. వెల్లలూరులోని జూనియర్ కళాశాలలో క్రీడలకు అవసరమైన ప్రాం గణం లేదు. పీడీ పోస్ట్ కూడా భర్తీ చేయలేదు. అదే ప్రాంగణంలోని హై స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయురాలు క్రీడల శిక్షణ ఇస్తున్నారు. పెదకాకాని మండలం వెనిగండ్లలోని జూనియర్ కళాశాలకు ఫిజికల్ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది.



సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏలూరి, రాము

సుబ్బారావుకు ఎమ్మెల్యేల నివాళి

హాజరైన ఏలూరి, రాము, గౌతు శిరీష కుటుంబ సభ్యులు

చిన్ననందిపాడు (పర్చూరు), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలం చిన్న నందిపాడు గ్రామానికి చెందిన ముప్పా సుబ్బారావు దశ దినకర్మ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతోపాటు, గుడివాడ ఎమ్మెల్యే వేణిగళ్ల రాము, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కుటుంబ సభ్యులు సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శిరీష భర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, సర్పంచ్ ముప్పా వెంకట శివరావు, ముప్పా నాగేశ్వరరావు, ముప్పా రవికిరణ్, లోకేంద్ర, కొమ్మాలపాటి పున్నారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం మార్టూరు మండలం ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో 41 మందికి మంజూరైన రూ.39,39,567లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఏలూరి అభినందనలు

నెల్లూరు జిల్లాలో క్రీడల సమాఖ్య అధ్వర్యంలో నిర్వహించిన చెవిటి, మూగ బధిరుల క్రికెట్ పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులకు ఆదివారం మార్టూరు మండలం ఇసుకదర్శి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేంగా అభినంచారు.

కవి కాసల సేవలు విశిష్టమైనవి



కాసలకు పురస్కారాన్ని అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

అద్దంకిటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పద్యం, గేయం, వచన వంటి విభిన్న ప్రక్రియల్లో సాధికారమైన పట్టు కలిగిన కవి డాక్టర్ కాసల నాగభూషణం అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక ఇందిరానగర్‌లోని పుట్టంరాజు కళా క్షేత్రంలో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ విశిష్ట సాహిత్య పురస్కార సభ ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అముక్తమాల్యాదకు కాసల చేసిన సరళవచనామ వాదం ప్రసిద్ధమైనదన్నారు. అముక్తమాల్యాద ఒక ప్రౌఢకావ్యమని, ఈ కావ్యాన్ని సులభశైలిలో సరళవచనామవాదం చేసిన కాసల తెలుగు భాషకు గొప్ప సేవ చేశారన్నారు. ఆ కావ్యంలోని విశేషాలను నేటితరం ఆ కళింపు చేసుకోవడానికి వీలుగా ఉంటుందన్నారు. డాక్టర్ కాసల రాసిన తిక్కన సీత-తులనాత్మక పరిశీలన అనే గ్రంథం, రామాయణాలు-సీత ప్రాతచిత్రణ అనే అంశంపై జరిగిన ఒక మంచి గ్రంథం అన్నారు. అనంతరం పట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ వి శిష్ట సాహిత్య పురస్కారాన్ని ట్రస్టు అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజలతో పాటు సభ్యులు డాక్టర్ కాసలకు అందజేశారు. కార్యక్రమంలో పద్య కవి డీవీఎం సత్యనారాయణ, ఇలపావులూరి శేషధరశర్మ, వారణాసి రఘురామశర్మ, చప్పిడి వీరయ్య, గాడేపల్లి దివాకర్‌దత్తు, అనంత రామకోటేశ్వరరావు, సుబ్బయ్య, మస్తాన్, సాయి, బాలసుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

అనుమతి కొంత .. అదనపు నిర్మాణం మరికొంత

- చీరాల ఆర్టీసీ డిపో ప్రాంగణంలో కట్టడంపై సర్వత్రా విమర్శలు
- జీ ప్లస్ వన్‌కు కేటాయించే స్థలంలో జీ ప్లస్ టూ పనులు
- తొలగించాలని డీఎం నోటీసులు
- ఒడా నుంచి మంజూరు కాని అనుమతులు

చీరాల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీకి ఆదాయం వచ్చే విధంగా చర్యలు చేపట్టటం హర్షనీయం. అయితే సదరు చీరాల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఆర్టీసీ ఇచ్చిన అనుమతికి మించి చేపడుతున్న నిర్మాణంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్టీసీ ప్రాంగణంలో 23 సెంట్ల ఖాళీ స్థలంలో జీ ప్లస్ వన్ నిర్మాణం చేపట్టి వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు టెండరు ద్వారా లీజుదారుకు అనుమతి ఇచ్చారు. నెలకు రూ.1,80,000 అద్దె, అందుకుగాను రూ.30,000 జీఎస్టీతో కలిపి నెలకు రూ.2,10,000 చెల్లించేలా అనుమతులు ఇచ్చారు. లీజు కాలపరిమితి 15 సంవత్సరాలు. అయితే సదరు లీజుదారుడు అద్దె ప్రాతిపదికలోని నిబంధనల మేరకు జీ ప్లస్ వన్ మాత్రమే నిర్మాణాలు చేపట్టాలి. అయితే జీ ప్లస్ టూకు కూడా ఇనుప ట్రస్‌లతో నిర్మాణ పనులు చేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆ నిర్మాణ పనులపై సర్వత్రా చర్చ జరుగుతోంది. పార్టీల ప్రస్తావన వస్తోంది. రాజకీయ కోణంలో విశ్లేషణలు జరుగుతున్నాయి. వాటిమాట ఎలా ఉన్నా అద్దె ప్రాతిపదికన ఇచ్చే క్రమంలో ఆర్టీసీ ఏ నిబంధనలు ఉన్నవో వాటిని అమలు పరిస్తే ఎలాంటి స మస్యలుండవు. లేదంటే ఒక వైపు ఆర్టీసీ ఆదాయానికి గండి పడే ప్రమాదం ఉండడంతో పాటు భవిష్యత్‌లో మరికొన్ని సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని విషయం తెలిసినవారు అంటున్నారు.



చీరాల ఆర్టీసీ ప్రాంగణంలో అనుమతులను అతిక్రమించి చేపట్టిన నిర్మాణం

అదనపు నిర్మాణాలను తొలగించాలని నోటీసులిచ్చాం

ఆర్టీసీ ప్రాంగణంలో 23 సెంట్ల స్థ లంలో నిర్మాణాలకు, వ్యాపార నిర్వహణకు అద్దె ప్రాతిపదికన ఇచ్చాం. జీ ప్లస్ వన్‌కు మాత్రమే అనుమతిచ్చాం. లీజుదారుడు జీ ప్లస్ టూకి ఇనుప కమ్మిలతో నిర్మాణ ప్రక్రియ చేపట్టారు. అవి తొలగించాలని నోటీసు ఇచ్చాం. నిబంధనల మేరకు అద్దె నెలకు రూ.1,80,000, అందుకుగాను రూ.30 వేలు జీఎస్టీ, మొత్తం నెలకు రూ.2,10,000 చెల్లించాలి. 15ఏళ్ల కాలపరిమితి. సుమారు ఆరు నెలల క్రితం అగ్రిమెంట్ జరిగింది. అదనపు నిర్మాణాలను అనుమతించం.

- శ్యామల, మేనేజర్, ఆర్టీసీ చీరాల డిపో

నిబంధనల మేరకు మాత్రమే నిర్మాణం చేపట్టాలి

ఆర్టీసీ ప్రాంగణంలో లీజుకు తీసుకున్న ప్రదేశంలో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించాం. నిబంధనల మేరకు మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని చెప్పాం. అతిక్రమిస్తే ఉన్న నిబంధనల మేరకు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

- శ్రీనివాసరావు, టీపీవో, చీరాల మున్సిపాలిటీ

సపోర్ట్ డాక్యుమెంట్స్ అడిగాం .. వాటిని దాఖలు చేయాల్సి ఉంది

ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో చేపడుతున్న నిర్మాణానికి సంబంధించి అనుమతుల కోసం దాఖలు చేసిన పత్రాలు పూర్తి స్థాయిలో సరిపోలేదు. పూర్తి సమాచారం కోసం సంబంధిత ధ్రువపత్రాలను జతచేసి పంపాలని చెప్పాం. లేదంటే అసలు నిర్మాణం, అదనపు నిర్మాణానికి సంబంధించి నిబంధనల మేరకు చర్యలు ఉంటాయి.

- బాబూరావు, ఒడా ప్లానింగ్ ఆఫీసర్, ఒంగోలు

వైభవంగా సీతారామస్వామి దేవస్థాన పునర్ నిర్మాణ పూజలు



సీతారాములను దర్శించుకుంటున్న భక్తులు

చినగంజాం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామంలోని సీతారామస్వామి దేవస్థానం పునర్ నిర్మాణ పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. సుమారు వంద సంవత్సరాల చరిత్ర గల సీతారామసామి దేవస్థానంలో నిత్య నైవేద్యాలు జరుగక మూత పడి ఉండడంతో గ్రామస్థులు పునర్ నిర్మాణానికి సంకల్పించారు. ఆగమశాస్త్ర పండితులు అగ్నిహోత్రం వెంకటశేషాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7గంటల నుంచి విష్వక్సేనారాధనము, పుణ్యాహవచనం, వాస్తుపూజ, పంచగవ్య ఆరాధన, ప్రోక్షణ అనంతరం అగ్నిప్రతిష్ఠాపనము, శాంతి హోమం, పూర్ణాహుతి, కూష్మాండబలి తదితర పూజలను నిర్వహించారు. అనంతరం దేవాలయ ద్వార బంధంను, సింహద్వారమును తెరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్వారాలు తెరిచి దేవస్థానంలో పూజలు చేశారు. పూజలు అనంతరం భక్తులు రాములోరిని దర్శించుకున్నారు. దేవస్థానంలోని విగ్రహాలను స్థానిక భూ సమేత భావనారాయణ స్వామి దేవస్థానికి తరలించారు. అక్కడ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మోటుమర్రి రామసుబ్బారావు, వలివేటి వెంకటరామానుజంలు తెలిపారు. నూతనముగా ఆలయాన్ని నిర్మించి విగ్రహాలను ప్రతిష్ఠించడం జరుగుతుందని తెలిపారు. దేవస్థానం ప్రాంగణం భక్తుల జై శ్రీరామ్ నామ స్మరణంతో మారుమోగిపోయింది. భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు. దేవదాయ శాఖ ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ నేత రాధాకృష్ణకు పరామర్శ

పంగులూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాగర్లమూడివారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తెలగతోటి రాధాకృష్ణమూర్తిని పలువురు నేతలు ఆదివారం పరామర్శించారు. రాధాకృష్ణ కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. నూతలపాడు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వేమా శ్రీనివాసరావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, ఒంగోలు 33వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి జగన్నాథం, మురళీమోహన్ పరామర్శించారు.

వృద్ధులకు నూతన వస్త్రాల అందజేత

అద్దంకిటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌ఎస్‌సీ 1989-90 పదివ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సేవా స్ఫూర్తి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు వృద్ధులకు నూతన దుస్తులను అందజేశారు. ఈ క్రమంలో సింగరకొండలోని రామమందిరంలోని వృద్ధులకు, కష్టజీవుల సేవా సంఘం వృద్ధాశ్రమంలో 75 మంది వృద్ధులకు క్రిస్మస్, సంక్రాంతి పండుగల సందర్భంగా వస్త్రాలను అందజేసినట్లు కమిటీ ప్రధాన కార్యదర్శి జ్యోతి రమేష్‌బాబు తెలిపారు.

తిరుమల సైకిల్ యాత్రకు సంఘీభావం

పంగులూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గుంటూరుకు చెందిన శ్రావణి హాస్పటల్ వైద్యుడు డాక్టర్ శ్రీనివాసరావు వారి మిత్ర బృందం తిరుమలకు చేపట్టిన సైకిల్ యాత్రకు పంగులూరు గ్రామ వాసులు సంఘీభావం తెలిపారు. గుంటూరుకు చెందిన గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణుడు శ్రీనివాసరావు మిత్ర బృందం తిరుమలకు చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం పంగులూరు మండలంలోకి చేరింది. గ్యాస్ట్రాలజీపై అవగాహన కోసం మూడేళ్లుగా సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొండమంజులూరు అడ్డరోడ్డువద్ద సైకిల్ యాత్రకు నాయకత్వం వహిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావుకు ఆర్ఎంపీ వైద్యులు డాక్టర్ వెంకటరావు పూలమాల వేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

కష్టాలు తీరేదెన్నడో.. ?

- ఆ ఇళ్లలో కాపురాలు చేసేదెప్పుడో... ● టిడ్కో గృహ లబ్ధిదారుల ఆవేదన
- పేదల సొంతింటి కల సాకారమయ్యేనా !?
- పొంగూరు, వేములపాటి చొరవ చూపాలి మరి..!!

నెల్లూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు.. రెండు కాదు.. పదేళ్ల నిరీక్షణ..! అయినా, జిల్లాలోని వేలాదిమంది పేద, మధ్య తరగతి ప్రజల సొంతింట కల సాకారం కానేలేదు. పట్టణ ప్రాంత పేదలకు గేటెడ్ కమ్యూనిటీ తరహాలో బహుళ అంతస్థుల భవన సముదాయాలు కట్టివ్వాలని టీడీపీ ప్రభుత్వం చేసిన ప్రయత్నం 2019 ఎన్నికల ఫలితాల క్రమంలో అర్థంతరంగా ఆగిపోయింది. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం తాళాలు అప్పగిస్తుందని పేదలు ఆశిస్తే.. రాజకీయ ద్వేషంతో ఆ గృహాలు పాడుపడేలా చేసింది. ఐదేళ్ల పాటు లబ్ధిదారులు తాళాలు తీసే అవకాశం ఇవ్వకుండా చేసింది. 2024 ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టిన ప్రజలు మళ్లీ టిడ్కో ఇళ్లపై ఆశలు పెట్టుకున్నారు. అప్పట్లో పట్టణాభివృద్ధిశాఖ మంత్రిగా టిడ్కో గృహాలకు రూపకల్పన చేసిన పొంగూరు నారాయణ... మళ్లీ అదేశాఖకు మంత్రి కావడం... జిల్లాకు చెందిన వ్యక్తి, జనసేన నాయకుడు వేములపాటి అజయ్‌బాబు ఏపీ టిడ్కో చైర్మన్ కావడంతో ఇళ్లకోసం ఎదురు చూస్తున్నవారి ఆశలు రెట్టింపయ్యాయి. ఇప్పుడు వాటిని బాగు చేయడంతో పాటు మౌలిక వసతులన్నీ కల్పించడం ద్వారా లబ్ధిదారులను ఆకర్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.



అసంపూర్తిగా ఉన్న అక్కచెరువుపాడులోని టిడ్కో గృహాలు

పరిస్థితి ఇదీ..

● నెల్లూరు నగర పరిధిలో మొత్తం ఆరుచోట్ల 20వేలకు పైగా టిడ్కో గృహాలు నిర్మించారు. అయితే గత పాలకుల పుణ్యమా అని.. అవేవీ నివాసానికి అనుకూలంగా లేవు. వెంకటేశ్వరపురం ఫేజ్1లో నిర్మించిన గృహాల్లో మౌలిక వసతులు అధ్వానంగా ఉన్నాయి. తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. వీధి దీపాలు వెలగడం లేదు. చీకటి రాజ్యమేలడంతో అక్కడ అసాంఘిక శక్తుల కదలికలు ఎక్కువయ్యాయి. పోలీసు నిఘా లేదు. దీంతో అక్కడ కాపురాలు ఉండాలంటేనే జనం హడలిపోతున్నారు. అల్లీపురం గృహసముదాయంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. చాలా ఇళ్లకు కరెంటు సరఫరా లేదు. డ్రైనేజీ కనెక్టివిటీ లేదు. రోడ్లు లేవు, ముళ్లపొదలు భయం గొలుపుతున్నాయి. అక్క చెరువుపాడు వద్ద భవన నిర్మాణాలు పూర్తి అయినా తాగునీరు, కరెంటు లేదు. కల్లూరుపల్లిలోనూ ఇదే పరిస్థితి. వీటిల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తే తప్ప ప్రజలు ఆ ఇళ్లలో చేరే పరిస్థితి లేదు.



ఆత్మకూరులోని టిడ్కో ఇళ్ల సముదాయం మధ్య పిచ్చిమొక్కలతో పార్కు స్థలం

● ఆత్మకూరులో 1408 ఇళ్లు నిర్మించారు. వీటిలో 1096ఇళ్లను మాత్రమే లబ్ధిదారులకు కేటాయించారు. మిగిలినవి ఇంకా కేటాయించలేదు. కేటాయించిన ఇళ్లలో 700 మంది మాత్రమే కాపురం ఉంటున్నారు. ఇక్కడ కూడా మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. గృహ సముదాయానికి ప్రహరీ గోడ లేదు. తాగునీటి సమస్య వెంటాడుతోంది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది.

ఇళ్ల మధ్య మురుగు తాండవిస్తోంది. గృహసముదాయం చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు బలిసిపోయాయి. వీటివల్ల విషకీటకాలు ఇళ్లలోకి చొరపడుతున్నాయి. వెంటనే ఇక్కడ మౌలిక వసతులు కల్పించని పక్షంలో ఉన్న కాపురాలు కూడా ఖాళీ చేసుకొని వెళ్లిపోయే ప్రమాదం ఉంది.

● కందుకూరులో 1408 గృహాలు నిర్మించారు. వీటిలో 90 శాతం లబ్ధిదారులకు కేటాయించారు. కానీ ప్రస్తుతం ఇక్కడ 400 కుటుంబాలు మాత్రమే కాపురం ఉంటున్నాయి. ఇక్కడ కూడా నీటి వసతి లేదు. అంతర్గత సిమెంటు రోడ్ల నిర్మాణం జరగలేదు. పార్కు, మినీ ఫంక్షన్ హాలు పనులు అర్థంతరంగా వదిలేశారు.

● కావలిలో 2112 గృహాలు నిర్మించారు. వీటిలో 700 మంది మాత్రమే కాపురం ఉన్నారు. వర్షం కురిస్తే ఈ గృహసముదాయంలోకి వరద నీరు ప్రవేశిస్తాయి. పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ప్రహరీ గోడ లేదు.

ఇలా వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన టిడ్కో ఇళ్లు దాదాపుగా నిరుపయోగంగా మారాయి. కూటమి ప్రభుత్వంలోనైనా ఇవి బాగుపడుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌బాబు.... ఇద్దరూ జిల్లాకు చెందిన వారు కావడంతో పక్కా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేదలు ఆశలు పెంచుకున్నారు. టిడ్కో గృహసముదాయాలు మౌలిక వసతులతో అందంగా తయారు కావాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఆ దిశగా వారిద్దరూ అడుగులు వేయాలని ప్రజలు ఆశిస్తున్నారు.

లేదు..లేదంటూనే ఇదేంటి?



జికా వైరస్ బాధితుల కోసం జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన పడకలు

- జికా వైరస్ రోగుల కోసం జీజీహెచ్‌లో ఐదు పడకలు
- ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏర్పాటు
- మందులు కూడా సిద్ధం

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జికా వైరస్ లేదు... లేదంటూనే అధికారులు వైరస్ సోకిన వ్యాధిగ్రస్థుల కోసం ప్రత్యేక పడకలు ఏర్పాటు చేయడం పలు అనుమానాలను తావిస్తున్నది. జిల్లాలో జికా వైరస్ ఇంకా నిర్ధారణ కాకపోయినా ప్రభుత్వ ముందస్తు చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఐదు పడకలను ఏర్పాటు చేసింది. పల్మనాలజీ విభాగంలో జికా వైరస్ అనుమానితులకు, రోగులకు చికిత్సలు అందిం చేందుకు జనరల్ మెడిసిన్ విభాగం అన్నీ ఏర్పాట్లు చేసింది. అవసరమైన మందులను కూడా అందుబాటులో ఉంచింది. జీజీహెచ్ అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర ఆధ్వర్యంలో ఈ ఏర్పాట్లు చేశారు.

జిల్లాలోని మర్రిపాడు మండలం వెంకటాపురంలో బద్దెల సుబ్బరాయుడు (5) అనుమానిత జికా వైరస్‌కు గురయ్యాడు. దీంతో తల్లితండ్రులు నాగరాజు, కళ్యాణిలు నారాయణ ఆసుపత్రికి తీసుకుపోగా, జికా వైరస్ అన్న అనుమానంతో చెన్నైలోని ఎగ్మూర్ ఆసుపత్రికి తరలించారు. తమిళనాడు ప్రభుత్వం ఈ కేసును సీరియస్‌గా తీసుకుని పరీక్షలు నిర్వహించి, జికా వైరస్ లేదని నిర్ధారించింది. అయితే బాధితుడి తల్లిదండ్రులతోపాటు మరో 20 మంది రక్తనమూనాలను సేకరించి, పూణేలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపించారు. అయితే ఇంకా ఫలితాలు రాలేదు. అయినా వెంకటాపురం గ్రామాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ బృందం సందర్శించి, పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టింది. దోమల నివారణకు మందులు పిచికారీ చేయించింది. వైద్య శిబిరం ఏర్పాటు చేయించింది. ఎవరైనా జ్వర పీడితులు ఉన్నారా... లేదా ? అన్న కోణంలోనూ పూర్తిస్థాయి సర్వే చేపట్టింది. ఈ క్రమలో జీజీహెచ్‌లో ప్రత్యేక పడకల ఏర్పాటు ముందు జాగ్రత్త చర్యనా.. లేక జిల్లాలో రోగులు ఎవరైనా ఉన్నారా...? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

బాధితుల కోసం అన్నీ ఏర్పాట్లు



జికా వైరస్ బాధితుల కోసం ముందస్తుగా ఐదు పడకలు ఏర్పాటు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని ఏర్పాట్లు చేశాం. జికా వైరస్ బాధితులకు మెరుగైన వైద్య అందించేందుకు జీజీహెచ్‌లో వైద్యులు సిద్ధంగా ఉన్నారు. జిల్లాలో జికా వైరస్ లేదని చెన్నైలోని ల్యాబ్ అధికారులు నిర్ధారించారు. పూణే వైరాలజీ ల్యాబ్ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాం.

- డాక్టర్ కళారాణి, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్

కుడి కాలువకు పూర్తి సామర్థ్యంతో నీరు

- రేపటిలోగా అందించాలని కలెక్టర్ ఆదేశం
- తాత్కాలిక గేటు వద్దు : రైతులు
- మంత్రి జోక్యంతో కదలిన అధికార యంత్రాంగం



కుడి కాలువ గేటుకు మోటార్లను ఏర్పాటు చేస్తున్న క్రేన్



మోటార్ల ఏర్పాటును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆనంద్, సబ్‌కలెక్టర్ శ్రీపూజ, ప్రకాశం జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి తదితరులు

కందుకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కుడి కాలువ స్టాప్‌లాక్ గేటు విరిగిపోయి ఆయకట్టుకు నీరందక రైతులు ఆందోళన చెందుతున్న క్రమంలో ఆదివారం రాళ్లపాడు రిజర్వాయరును జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ సందర్శించారు. కాలువ గేటు వద్ద మోటార్ల ద్వారా నీటిని అందించేందుకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. కాలువకు వెళుతున్న నీటి పరిమాణం వివరాలను అడిగి తెలుసుకున్నారు. 30 క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన నాలుగు మోటార్లను సోమవారం మధ్యాహ్నంలోగా ఏర్పాటు చేసి కాలువలో పూర్తి సామర్థ్యం నీరు వెళ్లేలా చూడటంతోపాటు దిగువ గ్రామాలకు సక్రమంగా నీరు అందేలా పర్యవేక్షించాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే రెవెన్యూ, పోలీసుశాఖల సహకారం తీసుకోవాలని సూచించారు.

గేటు లేపకుంటే కష్టమే...

తాత్కాలిక చర్యలు వద్దని, పడిపోయిన గేటు లేపేందుకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను రైతులు కోరారు. మోటార్ల ద్వారా అందించే నీటితో నాట్లు వేసుకోలేమని, ఇప్పటికే దుక్కులు ఎండిపోతూ.. పోసిన నార్లు ముదిరి పోతున్నాయని, దీంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని కలెక్టర్ వద్ద వారు వాపోయారు. ఇదేపద్ధతిలో నీరందిస్తే మరో 20రోజు లకు కూడా నాట్లు వేసుకోలేమని ఆవేదన వ్యక్తం చేశారు. తీరా నాట్లు వేశాక సక్రమంగా నీరందకపోతే ఎండిపోయి తీవ్రంగా నష్టపోతామన్నారు. రామాయపట్నం పోర్టు, చీమకుర్తి గ్రానైట్ ఫ్యాక్టరీల వద్ద భారీ క్రేన్లు ఉన్నాయని, వాటిని తెప్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఇరిగేషన్ అధికారులు గేటు లేపాలని పట్టుదలతో పనులు చేయకుండా, పైఅధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి కాలం వెళ్లబుచ్చుతున్నారని పలువురు రైతులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వాయర్‌లో నీటిమట్టం కొంతమేర తగ్గితే పడిపోయిన గేటు లేపడం సులువవుతుందని చెప్తున్నందున, మోటార్ల ద్వారా తాత్కాలికంగా నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని, 15 రోజుల్లో సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాళ్లపాడు కుడి కాలువకు పూర్తి సామర్థ్యం నీరు ప్రవహించేంత వరకు దగ్గరుండి పర్యవేక్షించడంతో పాటు ఆయకట్టు చివరి భూములకు కూడా సక్రమంగా నీరు అందేలా యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షించాలని కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజను కలెక్టరు ఆదేశించారు.

ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జోక్యంతో ఎట్టకేలకు అధికార యంత్రాంగం కదిలింది. కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, పలువురు ఆయకట్టు రైతులు గురువారం మంత్రి రామానాయుడిని కలిసి

మంత్రి జోక్యంతో కదిలిన యంత్రాంగం

రాళ్లపాడు రిజర్వాయర్ దుస్థితిని వివరించడంతోపాటు చిన్న సమస్యను 15 రోజులైనా పరిష్కరించలేక పోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడిన మంత్రి జిల్లా కలెక్టర్‌కు పరిస్థితిని వివరించాల్సిందిగా వారికి సూచించారు. శనివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే, రైతు ప్రతినిధులు నెల్లూరులో కలెక్టర్ ఆనంద్‌ని కలిసి పరిస్థితిని వివరించారు. దీంతో ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ ప్రాజెక్టు వద్దకు చేరుకొని జరుగుతున్న పనులను పర్యవేక్షించడంతోపాటు పురోగతిపై ప్రతిరోజు తనకు నివేదించాలని అధికారులను ఆదేశించారు.

షోకాజు నోటీసులు... సస్పెన్షన్లు

- వణుకుతున్న నగర కార్పొరేషన్ ఉద్యోగులు
- కమిషనర్ కఠిన నిర్ణయాలతో బెంబేలు
- సిబ్బంది అవినీతి, నిర్లక్ష్యంపై కొరడా

నెల్లూరు(సిటీ),డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర కార్పొరేషన్‌లో చోటుచేసుకున్న అవినీతి, నిర్లక్ష్యంపై కమిషనర్ సూర్యతేజ కొరడా ఝుళిపిస్తున్నారు. దీంతో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది వణికిపోతున్నారు. అందుతున్న ఫిర్యాదులు, ఆకస్మిక తనిఖీలతో పలు విభాగాల పనితీరు పరిశీలిస్తున్న ఆయన ఎవరి ఊహకు అందని విధంగా ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. రెవెన్యూ విభాగంలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఆర్ఐ, ఆర్వోలను సమూలంగా బదిలీ చేశారు. సిటీప్లానింగ్‌లో అవినీతి క్షేత్రస్థాయిలో జరుగుతుందని గ్రహించిన కమిషనర్ సచివాలయాల్లోని ప్లానింగ్ సెక్రటరీలందరినీ కూడా బదిలీ చేశారు. తాజాగా ఆ విభాగం ఉన్నతాధికారి కృష్ణకిషోర్ నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర డైరెక్టర్‌కు సరెండర్ చేశారు. మరో ఇద్దరు ప్లానింగ్ సెక్రటరీలను కూడా సస్పెండ్ చేశారు. దీంతో ఉద్యోగులంతా బెంబేలెత్తుతున్నారు.

హెచ్చరించినా బేఖాతర్



నెల్లూరు నగర పాలక సంస్థను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ఉద్యోగులు, సిబ్బందిలో నిర్లక్ష్యంతో పాటు జవాబుదారీతనం లేకుండా పోయింది. కూటమి ప్రభు త్వం కొలువుతీరాక ఎస్ఎంసీ కమిషనర్‌గా మల్లవరపు సూర్య తేజ వచ్చారు. ఇక్కడ నెల కొన్న అవినీతి, నిర్లక్ష్యపు చెదలును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. తొలుత హెచ్చరించినా ఎవరూ పట్టించుకోకపోవడంతో సమూలంగా మార్పులు చేశారు. కొందరికి షోకాజు నోటీసులు ఇవ్వగా, మరికొందరిని సస్పెండ్ చేశారు. ఇక భవన నిర్మాణాలపై ఆకస్మిక తనిఖీలకు వెళ్లిన కమిషనర్ క్షేత్రస్థాయిలో అన్నీ గమనిస్తున్నారన్న సంకేతాలను పంపారు. రెండు సచివాలయాల్లో ప్లానింగ్ సెక్రటరీల అవినీతి, నిర్లక్ష్యంపై వేటు వేశారు. ఆపై అధికారులకు షోకాజు నోటీసులు కూడా జారీ చేశారు. వారిచ్చే సమాధానంతో తదుపరి నిర్ణయం ఉంటుందని పరోక్ష హెచ్చరిక పంపారు. పత్రికల్లో (ఆంధ్రజ్యోతి) వస్తున్న కథనాలను సుమోటోగా తీసుకుని చర్యలు చేపట్టాలని, తొలుతే కమిషనర్ ఆదేశించారు. ఆ పని చేయడం లేదన్న కారణంతో ఎస్ఈ రామ్మోహన్, ఉద్యాన అధికారి ప్రదీప్, ఈఈ శేషగిరిలకు ఇటీవలే షోకాజు నోటీసులిచ్చారు.

రాజకీయ జోక్యానికి చెక్

కార్పొరేషన్‌లో ఆఫీసు సబార్డినేట్ నుంచి విభాగాధిపతి వరకు మితిమీరిన రాజకీయ జోక్యంతో పని చేస్తున్నారన్నది అందరికి తెలిసిన విషయమే. అయితే ఈ విధానానికి కళ్లెం వేస్తూ, రాజకీయ నాయకులతో సిఫార్సు చేయిస్తే వారి విజ్ఞప్తులను పట్టించుకోనంటూ ప్రత్యక్షంగానే హెచ్చరిస్తున్నా రు. ఇటీవల పలు విభాగాల్లోని ఉద్యోగులను కమిషనర్ బదిలీ చేశారు. వీరిలో అనేకమంది అధికార పార్టీ నేతలతో సిఫార్సులు చేయించారు. ఆగ్రహించిన కమిషనర్ వారి విజ్ఞప్తులను పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో విభాగాల వారీగా పట్టుపెంచుకుంటున్న కమిషనర్ ఏరోజు ఏ అధికారికి, ఏఉద్యోగికి షోకాజు నోటీసు ఇస్తారో... ఎవరిపై సస్పెన్షన్ వేటు వేస్తారో.. అర్థం కాక వణికిపోతున్నారు.

పట్టణాలపైనే మోజు



జలదంకి మండలం అన్నవరంలోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

- పల్లెలకు రాని ట్రాన్స్‌కో ఏఈలు
- ఉదయగిరి నియోజకవర్గమంటేనే ససేమిరా...
- 8 మండలాలకు వింజమూరులోనే నియామకం
- మిగిలినచోట్ల సబ్ ఇంజనీర్లే దిక్కు
- వ్యవసాయ విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం
- సమస్యల పరిష్కారానికి రోజుల తరబడి నిరీక్షణ
- ఇబ్బందులు పడుతున్న రైతాంగం

జలదంకి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో 8 మండలాలు ఉంటే, ఒక్క వింజమూరు మండలానికే ట్రాన్స్‌కో ఏఈ నియామకం జరిగింది. మిగిలిన ఏడు మండలాలకు ఏఈల నియామకం జరగలేదు. ఈ మండలాల్లో సబ్‌ఇంజనీర్లుగా ఉన్న వారికే ఏఈ బాధ్యతలు అప్పగించారు. కొండాపురం మండలానికైతే సబ్‌ఇంజనీరు పోస్టు ఖాళీగా ఉండడంతో కలిగిరి సబ్‌ఇంజనీరును కొండాపురానికి ఇన్‌చార్జిగా నియమించారు. ఈ పరిస్థితి గత వైసీపీ పాలన నుంచి కొనసాగుతున్నది. కూటమి ప్రభుత్వంలోనైనా ఏఈలను నియమిస్తారని అనుకున్న ప్రజలకు నిరాశే మిగిలింది. ఏఈలు లేక విద్యుత్ సమస్యలు ఏర్పడితే నెలలు తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పేరుకుపోతున్న సమస్యలు

ట్రాన్స్‌కో ఏఈలు లేక ఉదయగిరి నియోజకవర్గంలో రోజురోజుకు విద్యుత్ సమస్యలు పేరుకుపోతున్నాయి. ముఖ్యంగా ఉదయగిరి ప్రాంతమంతా వ్యవసాయంపై ఆధారపడడమేకాక, వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగుచేస్తారు. ఇక్కడ బోరు బోవులు, మోటార్లు కూడా అధికంగానే ఉన్నాయి. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో నిత్యం అంతరాయం కలుగుతుండడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ఒక్క జలదంకి మండలం లోని కొంతభాగం సోమశిల ప్రాజెక్ట్ పరిధిలోని కావలి కాలువ ఆధారంగా వ్యవసాయం చేస్తారు. మిగతా ప్రాంతమంతా చెరువులు, వ్యవసాయ బోర్ల కింద వరి, పండ్లతోటలను సాగు చేస్తున్నారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో రైతులు నిత్యం సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల జలదంకి మండలంలోని పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో వరినాట్లు వేయాలంటే మోటార్లకు విద్యుత్ సరఫరా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు ఈ విషయాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి మండల టీడీపీ నాయకులు, రైతులు తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే ఈ సమస్యను విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారు. మంత్రి ఆదేశాలతో ట్రాన్స్‌కో ఎస్ఈ జలదంకి మండలంలో పర్యటించి, మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను బాగుచేయించడంతో రైతులు వరినాట్లు వేసుకున్నారు. చిన్నచిన్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే, మంత్రి దాకా రైతులు వెళ్తేకానీ పరిష్కారం కావడం లేదు. దీన్నిబట్టి ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు ఏస్థాయిలో విద్యుత్ సమస్యలను ఎదుర్కొంటున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇంతటి ఇబ్బందులు ఎదుర్కోవడానికి ప్రధాన కారణం ఏఈల నియామకం లేకపోవడమే. అదే ఏఈలు ఉంటే కింది స్థాయి సిబ్బంది పనిలో వేగం ఉంటుంది. సబ్‌ఇంజనీరు చెబితే కింది స్థాయి సిబ్బంది సరిగా స్పందించడం లేదు. దీంతో విద్యుత్ సమస్యలు పేరుకుపోతున్నాయి.

పట్టణాల్లో ఆదాయం ఎక్కువే..

ఉదయగిరి నియోజకవర్గంలో పరిశ్రమలు, వ్యాపారసంస్థలు పెద్దగా లేవు. కేవలం గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులే ఉండడంతో ట్రాన్స్‌కో సిబ్బందికి ఆదాయమార్గాలు పెద్దగా ఉండవు. పరిశ్రమలు, రొయ్యల చెరువులు, వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థలు ఉన్న చోట్ల ఏఈలు పైరవీలు చేసుకుని పోస్టింగ్‌లు వేయించుకుంటే రెండు చేతులా సంపాదించుకోవచ్చు. అంతేకాక వారి కుటుంబాలు పట్టణాల్లో నివాసాలు ఉండడం, అక్కడి నుంచి ఉదయగిరి లాంటి సుదూరం ప్రాంతాలకు వెళ్లలేక పట్టణాల్లోనే పోస్టింగ్ వేయించుకుంటున్నారు. పిల్లల విద్యాభ్యాసం కోసం కార్పొరేట్ పాఠశాలలు, కాలేజీలు లేకపోవడం కూడా ఉదయగిరి ప్రాంతంలో పోస్టింగ్‌కు ట్రాన్స్‌కో ఉద్యోగులు వెనుకాడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఉదయగిరి నియోజకవర్గంలో ఏఈలపై నియామకంపై శ్రద్ధ పెట్టాలని రైతాంగం కోరుతున్నది.

పల్లెలంటేనే చిన్నచూపు

అదే కావలి నియోజకవర్గం విషయానికొస్తే కావలిపట్టణంలో ఇద్దరు ఏఈలతోపాటు అన్నీ మండలాలకు ఏఈలు ఉన్నారు. కావలి పట్టణ ప్రాంతం కావడంతోపాటుగా పట్టణానికి దగ్గరగా ఉన్న మండలాలు కావడంతో ఇక్కడ పనిచేసేందుకు ఏఈలు ఉత్సాహంగా ముందుకు వసున్నారు. పైరవీలు చేసుకుని మరీ పోస్టింగ్‌లు వేయించుకుంటున్నారు. ఇకపోతే ఆత్మకూరు, ఉదయగిరి పట్టణాల్లోనూ పనిచేసేందుకు పలువురు ఏలులు ఉత్సాహం చూపుతున్నారు. పల్లెల్లో పోస్టింగ్ అంటే మాత్రం ఆసక్తి చూపడం లేదు.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

కావలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో అంబేద్కర్ మేధస్సును వ్యక్తపరుస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాల మాటలను వక్రీ కరించి రాజకీయం చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చర్యలను నిరసిస్తూ ఆదివారం బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుసు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నేతలు హరిజన, గిరిజన మహిళలతో నిరసన చేపట్టారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం స్థానిక ట్రంకురోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి వెంకటేశ్వర్లు మాట్లాడారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకువస్తోందన్నారు. గత కాంగ్రెస్ పాలనలో అంబేద్కర్ ఆశయాలను పూర్తిగా విస్మరించిందన్నారు. రాహుల్ గాంధీ ఎన్ని కుయుక్తులు పన్నినా అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదన్నారు. మోదీ, అమిత్‌షాను విమర్శిస్తే కాంగ్రెస్‌కు బీజేపీ తగిన బుద్ధి చెబుతోందన్నారు. కార్యక్రమంలో నేతలు కందుకూరు వెంకటసత్యనారాయణ, గుండ్లపల్లి భరత్ కుమార్, కే బ్రహ్మానందం, సీవీసీ సత్యం, మందా కిరణ్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి పదవి నుంచి అమిత్‌షాను తొలగించాలి



ర్యాలీలో పాల్గొన్న ఐక్యవేదిక సంఘాల నాయకులు

కందుకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవహేళ చూస్తూ మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని ఆదివారం ఉపాధ్యాయ, ఉద్యోగ, కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కందుకూరులో ర్యాలీ చేపట్టారు. జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడారు. దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు చిరంజీవి, కల్లగుంట్ల మోహన్‌రావు, షేక్ అబ్దుల్లా, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, ఎస్‌కే గౌస్, నేతి మహేశ్వరరావు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణ

● చదును చేసి పంటల సాగు ● అధికారుల ఆదేశాలు బేఖాతరు



భూమిలో దుక్కి చేసిన ఆక్రమణదారులు



సాగులో ఉన్న దోస పంట

ఉదయగిరి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పలుకుబడితో కొంతమంది నాయకులు అధికారులను లోబర్చుకొని రెవెన్యూ రికార్డులను సైతం తారుమారు చేసి ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని తమ స్వాధీనం చేసుకుంటున్న సంఘటనలు నియోజకవర్గ పరిధిలోని వరికుంటపాడు మండలంలో రోజుకో చోట వెలుగు చూస్తున్నాయి. తాజాగా గణేశ్వరాపురంలో అలాంటి ఆక్రమణల పర్వం బట్టబయలవడం గమనార్హం. గ్రామంలోని కొంతమంది న్యాయం చేయాలని కోరుతూ ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడంతో అవినీతి భాగోతం బట్టబయలయ్యింది. గ్రామంలోని 169, 196 సర్వే నంబర్లలో 455.29 ఎకరాల ప్రభుత్వ పశువుల మేత పోరంబోకు ఉంది. వాటిపై కన్నేసిన ఆక్రమణదారులు అందులోని సుమారు 150 ఎకరాల భూములు ఆక్రమించుకున్న కొంతమంది పంటలు సాగు చేసుకుంటుండగా, మరికొంతమంది తమ ఆధీనంలోనే ఉంచుకొని అర్హులకు అవకాశం లేకుండా చేస్తున్నారు. గతంలో కొంత భూమి ఆక్రమణకు గురైన సమయంలో అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఇటీవల మరికొంతమంది ఇదే అదునుగా భావించి మరికొంత భూమిని యంత్రాలు, ట్రాక్టర్లతో రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా చదును చేసుకొని పంటలు సాగు చేసుకొనేందుకు సిద్ధమవుతుండడం విశేషం. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

సీజేఎఫ్ఎస్ భూములకూ ఎసరే

గ్రామంలోని ఎస్సీలకు గతంలో ప్రభుత్వం పంపిణీ చేసిన సీజేఎఫ్ఎస్ భూములపై కన్నేసిన ఆక్రమణదారులు వాటిని సైతం ఆక్రమించుకునేందుకు తమదైన శైలిలో పావులు కదుపుతున్నారు. ఆ భూములను 2018లో టీడీపీ ప్రభుత్వం అసైన్‌మెంటు పట్టాలుగా మార్చుచేసి పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఆ తరుణంలో అధికారులను లోబర్చుకున్న ఆక్రమణదారులు అలాంటి భూముల రికార్డులను తారుమారు చేసి ఆక్రమణకు తెరలేపారు. తమ భూములకు ఆనుకొని పశువుల మేత పోరంబోకు, అసైన్‌మెంటు భూములు ఉండడం కొంతమంది ఆక్రమణదారులకు వరంగా మారింది. అధికారుల చర్యలు అంతంతమాత్రంగా ఉండడంతో మరికొంతమంది గ్రామస్థులు గ్రామంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను ఆరా తీసి ఆక్రమించుకునేందుకు కసరత్తు చేస్తున్నారు.

ఫిర్యాదులతో విచారణ

ఈ నేపథ్యంలో కొంతమంది గ్రామస్థులు కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజకు వరుస ఫిర్యాదులు చేశారు. దీంతో ఆమె తహసీల్దారు, వీఆర్వో, సర్వేయర్లతో గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. భూములను పరిశీలించడంతో పాటు ఆక్రమణదారులను హెచ్చరించారు. అలాంటి వారికి నోటీసులు అందజేసి భూములను స్వాధీనం చేసుకోవాలని తహసీల్దారుకు సూచించారు.

ఘనంగా గంధ మహోత్సవం

ఏఎస్ పేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కుర్షిద్ అమ్మవారి దర్గా గంధ మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా సజ్జాద మహమ్మద్ ఇంటి నుంచి గంధాన్ని బాణసంచా వేడుకల నడుమ దర్గాకు తరలించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాళ్లపాడు ఆయకట్టులో ప్రతి ఎకరాకు సాగునీరిస్తాం



తూము పనుల పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ శ్రీపూజ

లింగసముద్రం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో రైతులు సాగుచేసిన ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తామని నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 7వరకు ఆయన నీటి సరఫరా పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. రైతులకు సాగునీరు ఇచ్చేందుకు ఎంత ఖర్చునైనా ప్రభుత్వమే భరిస్తుందని ఈ మేరకు జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చారని తెలిపారు. 15రోజుల క్రితం దెబ్బతిన్న స్టాప్‌లాక్ గేటు బాగు చేసేందుకు అధికారులు, బెకాం ప్రతినిధులు కృషి చేశారని, చివరిగా మెఘా కంపెనీ ప్రతినిధులు మోటార్లు తెచ్చి నీరు ఇచ్చేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. అయితే ప్రతిపక్షాలు ప్రతీది రాజయకీయం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఇరిగేషన్ సీఈ శ్యాంప్ ప్రసాద్, ఎస్ఈ పీ వరలక్ష్మీ, డీఈ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

మహిళల హక్కుల కోసం నిత్య పోరాటం

కందుకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళల రక్షణ, వారి హక్కులను కాపాడటంలో ముఖ్యపాత్ర పోషించి పోరాటాలు చేసేది ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య మాత్రమే అని రాష్ట్ర మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు జయలక్ష్మీ తెలిపారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయ ఆవరణలో ఆదివారం కారంశెట్టి ఇంద్రజ అధ్యక్షతన జరిగిన మండల జనరల్ బాడీ సమావేశంలో ముఖ్య అతిథులుగా జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, జయలక్ష్మీ పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం సనాతన ధర్మాన్ని తీసుకురావాలని ప్రత్నాలు చేస్తుందని దీన్ని అరికట్టాల్సి బాధ్యత అందరిపై ఉందని, మహిళలు సొంతంగా ఆలోచించే హక్కును కోల్పోవడంతో పాటు మహిళ ఇంటి నుంచి బయటికి రాలేని పరిస్థితి ఏర్పడిందని సమావేశంకు వచ్చిన పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కార్యదర్శి సుదర్శి రావమ్మ, రావులకొల్లు లక్ష్మీ, బూసి సురేష్‌బాబు, యర్రంశెట్టి ఆనందమోహన్, శైలజ, కల్పన, జ్యోతి పాల్గొన్నారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ భారతీయ సంస్కృతికి ప్రతిబింబం



మంచిమాట కార్యక్రమంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అనేది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని తెలుగు భారతి సేవా సమితి సభ్యులు తెలిపారు. ఆత్మకూరు పట్టణంలో ఆదివారం తెలుగు భారతి సేవాసమితి ఆధ్వర్యంలో మంచి మాట కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి కుటుంబం గురించి చర్చించారు. ఈ సందర్భంగా ప్రగతి ఆంగ్ల మాధ్యమ పాఠశాల కరస్పాండెంట్ ఎస్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబంలో సభ్యుల మధ్య ప్రేమ, అనుబంధాలు బలంగా ఉంటాయన్నారు. ఉమ్మడి కుటుంబంలో వనరుల సమర్థ వినియోగం ద్వారా ఆర్థిక సమస్యలు తేలికగా పరిష్కారమవుతాయని వివరించారు. ఆధునిక కాలంలో ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు భారతి సేవా సమితి అధ్యక్షుడు సోమవరపు సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షుడు ఏ గోవిందరెడ్డి, సహాయ ప్రధాన కార్యదర్శి జి రామిరెడ్డి, గౌరవ సలహాదారులు ఎస్‌వి రమణయ్య, కెవి శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలిజల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వెలిశెట్టి శ్రీహరి రాయులు

కావలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బలిజల ఆత్మగౌరవ సభ ఈ నెల 29న నెల్లూరు కాపు (బలిజ) భవనంలో నిర్వహించనున్నట్లు ఆ సభను జయప్రదం చేయాలని రాయలసీమ బలిజ మహాసభ అధ్యక్షుడు వెలి శెట్టి శ్రీహరి రాయులు పిలుపునిచ్చారు. ఈ విషయంపై స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సమ్మను వెంకట సుబ్బయ్య, స్థానిక కాపునేతలతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కాపునాడు పూర్వపు చైర్మన్ మిరియాల వెంకట్రావు 85వ జయంతి, వంగవీటి మోహన్ రంగారావు 36వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ ఆత్మగౌరవసభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణతో పాటు, ప్రస్తుత కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బరాయుడు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాపు రాష్ట్రస్థాయి ప్రముఖులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో బలిజ పేద మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు, టాలెంట్ అవార్డులు, బలిజబంధు పురస్కారాలు, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో బలిజలందరూ పాల్గొని జయ ప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాపు నేతలు నువ్వుశెట్టి జనేష్, పాలడుగు వెంకటేశ్వ రరావు, తోట ప్రభాకర్‌రావు, పసుపులేటి శ్రీనివా సులు, కేశవరావు, తోకల వెంకటేశ్వర్లు, ఉమా రాజు రాయల్ పాల్గొన్నారు.

మత ప్రచారంపై చర్యలు తీసుకోవాలి

కందుకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో మతప్రచారం చేసిన, ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య, శ్రీనివాసరావు, కోశాధికారి రఘు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హేతుబద్ధంగా ఉండాల్సిన అధికారులు మత పరమైన కార్యక్రమాలు వారి ఇళ్ల వద్ద చేసుకోవాలన్నారు. ఈనెల 21న నెల్లూరు మున్సిపల్ కార్యాలయంలో క్రిస్మస్ ముందస్తు సంబరాలు నిర్వహించగా అందులో నగర మేయర్ స్రవంతి, కమిషనర్ సూర్యతేజ, అదనపు కమిషనర్ నందన్ పాల్గొని క్రీస్తు బోధనలు, కీర్తనలు చేయడం తగదన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కూడా ఓ క్రిస్టియన్ మత పెద్దలతో కార్యక్రమం జరపనున్నట్లు సమాచారం ఉందని అలాంటి కార్యక్రమాలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోండి

కందుకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పందలపాడు సమీపంలోని పాలేరువాగులో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఆదివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పందలపాడు గ్రామస్థులతో కలిసి కలెక్టర్ ఆనంద్‌కు సూచించారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గానికి చెందిన వ్యక్తులు పెద్దఎత్తున ఇసుక రవాణా చేస్తున్నారని తెలిపారు. రవాణాకు వీలుగా నదీలో రోడ్డు నిర్మాణం వేయడంతో పాటు, ఎక్స్‌కవేటర్లతో ఇసుకను టిప్పర్లకు లోడు చేసి తరలిస్తున్నారని చెప్పారు. దీంతో ఆయన వారితో కలిసి తక్షణం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు వీడ్కోలు

కందుకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజి నేషనల్ కెడేట్స్ ట్రూప్ 34(ఏ) బెటాలియన్ పరిధిలోని ఉత్తమ సాధనలో బెస్ట్ టీంగా పేరుపొందినట్లు సుబేదారు ఇంద్రజిత్ ప్రశంసించారు. ఫైనల్‌ఇయర్ విద్యార్థుల ఎన్‌సీసీ ట్రూప్‌కి జూనియర్ ట్రూప్‌లు ఆదివారం వీడ్కోలుసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి ట్రెక్కింగ్‌కు ప్రకాశం కాలేజి విద్యార్థులు ఎంపిక కావడం హర్షనీయమన్నారు. యుద్ధభూమిలో మరణించిన సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, టెక్నికల్ డైరెక్టర్ విజయ్ శ్రీనివాస్, సుధీర్ పాల్గొన్నారు.

ఘటిక సిద్దేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే కాకర్ల



సీతారామపురం : కాకర్ల సంహిత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసులు, నేతలు

సీతారామపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తనయుడు సంహిత్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని సిద్దేశ్వరంలోని ఘటిక సిద్దేశ్వరస్వామి, ఇష్టకామేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి భోగినేని కాశీరావు, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు షేక్ బాబు, జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక ప్రతినిధి తురక వెంకటేశ్వరు, భోగినేని కాశీరత్తయ్య(గాంధి), ఎడమ ప్రవీణ్, పిడుగు రమేష్, విక్కీబాబు, విజయ్, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● వేంకటేశ్వరస్వామి సేవలో...

వింజమూరు: ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తనయుడు కాకర్ల సంహిత్ పుట్టినరోజు సందర్భంగా వింజమూరులోని తిరుమలనగర్‌లో ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కుటుంబ సభ్యులు, పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, భాష్యం నరసింహులునాయుడు, మనోప్రకాష్, దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు జూపల్లి వెంకటేశ్వర్లు, మధురెడ్డి, వెంగపనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఉలవపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కొల్లూరుపాడు ఎస్సీ కాలనీకి చెందిన సుదర్శి వేణు (35) ఆదివారం విద్యుదాఘాతంతో మరణించాడు. బంధువులు చెప్పిన వివరాల మేరకు.. ఉదయం 10గంటల సమయంలో గేదెలకు మేత కోసమని ఇంటి నుంచి బయలుదేరాడు. సాయంత్రం 6గంటలైనా ఇంటికి తిరిగి రాకపోవడం, ఫోన్ స్విచ్‌లో ఉండటంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అంకమ్మ సిబ్బందితో కలిసి ఆవులబాటలోని సపోట తోటలో టార్చిలైట్స్ వెలుగులో వెతగ్గా విగతజీవుడిగా పడి ఉన్న వేణుని గుర్తించారు. పరిసర ప్రాంతాన్ని పరిశీలించగా పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తాకి మృతి చెంది ఉంటాడని గుర్తించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి రజిత భార్య ఉన్నది. వేణు మృతితో ఎస్సీ కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి.

సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలచెరువుపల్లిలో ఆదివారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నూతనంగా మంజూరైన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు కూటమి నాయకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు పత్తి జానీ, నూల మాల్యాద్రి, కోలా నాగరాజు, కాకుమాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల ఎనిమిది మంది మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 10వేల వంతున ఆదివారం శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనాలకు ఉచితంగా రంగులు

ఉలవపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనానికి ఇండిగో పెయింట్స్ డీలర్, పూర్వ విద్యార్థి మనోజ్ సంస్థ ప్రతినిధులను ఒప్పించి ఉచితంగా రంగులు వేయించినట్లు ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో శివనాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఇండిగో పెయింట్స్ కంపెనీ మేనేజర్ మల్లికార్జున రెడ్డి మాట్లాడారు. ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల భవనానికి ఉచిత పెయింట్స్ అందించేందుకు ఉలవపాడును ఎంచుకున్నట్లు తెలిపారు. పెయింటర్స్‌కి బహుమతులు, కంపెనీ తరుపున బీమా సౌకర్యం కల్పించామన్నారు. ఈ సందర్భంగా మనోజ్, కంపెనీ ప్రతినిధులను ఘనంగా సత్కరించినట్లు ఆంగ్ల ఉపాధ్యాయుడు సుధాకర్ తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

● హరీష్, నర్రవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి



దుత్తలూరు (ఉదయ గిరి) డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులు నివారించవచ్చని నర్రవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి హరీష్ తెలిపారు.

? సీజనల్ వ్యాధులు ఎలా వస్తాయి.

! తాగునీరు కలుషితం వల్ల జ్వరం, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులతోపాటు వైరల్ ఫీవర్ వస్తాయి. ఇవి రాకుండా వర్షాకాలంలో ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

? సీజనల్ వ్యాధుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! పరిసరాలు, డ్రైనేజీలు, మురికిగుంతలు, నిల్వ నీటిలో లార్వా చేరకుండా వైద్యఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎం, ఆశ కార్య కర్తలతో పంచాయతీ సిబ్బంది సమన్వ యంతో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి శానిటేషన్ కార్యక్రమం చేపడుతున్నాం.

? దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారా.

! వైద్యఆరోగ్య, పంచాయతీల సిబ్బంది సంయుక్తంగా దోమల నివారణ చర్యలు చేపడుతున్నారు. అలాగే దోమలు పుట్టకుండా చర్యలు తీసుకోవడంతోపాటు దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

న్యూస్ బాక్స్

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సంగం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్లలో నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. మధ్యా హ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

బిట్రగుంట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాతబిట్రగుంట ద్వారకా నగరులోని శేష సాయినాథుడి మందిరంలో ఆదివారం ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రామకృష్ణాచార్యుల ఆధ్వర్యంలో సాయి బాబాకు అభిషేకాలు, నగర సంకీర్తన, భజనలు చేశారు. మందిర వ్యవస్థాపకులు కుట్టుబోయిన బ్రహ్మానందం, వసుంధర దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా గణిత దినోత్సవం

అనంతసాగరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో ఆదివారం గణిత దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ

ఉదయగిరి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడినరవ ఎస్సీ కాలనీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం వితంతు మహిళలకు దాతలు చీరలు పంపిణీ చేశారు. సమీప గండిపాళెం గ్రామానికి చెందిన బీఎస్ ఎలక్ట్రికల్ దుకాణ యజమాని గొల్లపల్లి భాస్కర్, స్వరూపరాణి దంపతులు క్రిస్మస్ పర్వదినాన్ని దృష్టిలో ఉంచుకొని తమవంతు చేయూతగా పేదలకు చీరలను అందజేసి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ఆనందంగా నిర్వహించుకోవాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వింజమూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం తరపున 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, సుప్రజ, హేమలత, ఉమా, సుభద్ర, పెంచలమ్మ, స్వరాజ్యం, జానకిరామిరెడ్డి, రవిచంద్ర, అంకిరెడ్డి, సుబ్బారెడ్డి, తదితర 40 మంది ధ్యానులు పాల్గొన్నారు.

రక్తదాతలకు బహుమతులు

అనంతసాగరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం రెడ్‌క్రాస్, జేవీవీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. పలువురు దాతలు రక్తదానం చేశారు. అనంతసాగరం పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఉద్యోగి సుబ్బమ్మ దాతలకు బహుమతులు అందజేసి శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు సుధాకర్, వేము పెంచలయ్య పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ఏఎస్ పేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌కి చెందిన సయ్యద్ నజీర్ కుటుంబ సభ్యులతో సుమారు వారం క్రితం ఏఎస్ పేట దర్గాకు వచ్చేశారు. నజీర్‌కు ఆరోగ్యం బాగా లేకపోవడంతో దర్గా వద్దే ఉంటున్నారు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం నుంచి నజీర్ కనబడకుండా పోయాడు. దీంతో వారి కుటుంబ సభ్యులు దర్గా కార్యాలయంలో, ఏఎస్ పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.